Follow: @mahaadaily

17-12-2025

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 358 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## మెస్సీ దెబ్బకు క్రీడా మంత్రి ఔట్

- రాజీనామా చేయించిన మమత



02

## 21న కేసీఆర్ భేటీ

- పాలమూరులో సభకు వ్యూహరచన



02

## ఒక్క పాట.. 100 రికార్డులు బద్దలు

- చికిరి చికిరి ట్రెండ్



02



# శభాష్.. రేవంత్

### అభినందించిన సోనియాగాంధీ

'తెలంగాణ రైజింగ్'తో ముందుకు వెళ్లాలని సూచన

రేవంత్ దూరదృష్టికి అభినందన

**ఢిల్లీ, మహా:** తెలంగాణలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వ పనితీరుపై సోనియా గాంధీ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి ప్రదర్శిస్తున్న దూరదృష్టిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తయారు చేసిన ప్రణాళికలు, గత రెండేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై చర్చ జరిగింది.

మిగతా 2లో



## సింగరేణి సీఎండిగా కృష్ణభాస్కర్

**హైదరాబాద్, మహా:** సింగరేణి సంస్థ ఇన్‌ఛార్జి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను నిర్వహిస్తున్న ఎన్. బలరాం కేంద్ర సర్వీసుల గడువు ముగిసింది. దీంతో ఆయనను విధుల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలరాం స్థానంలో తక్షణమే బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కృష్ణభాస్కర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మిగతా 2లో

## ఆస్ట్రేలియా బీచ్‌లో కాల్పులు

హైదరాబాద్‌తో నిందితుడు సాజిద్‌కు లింకులు

వివరాలు 2లో



## పోలీసుల అదుపులో మావోయిస్టు కీలకనేత

బడేచొక్కారావు సహా మొత్తం 16 మంది అదుపులో...

**ఆసిఫాబాద్ , మహా :** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ కీలక నేత బడే చొక్కారావు ఆసిఫాబాద్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. ఆయనతో పాటు సిర్పూర్‌లో మరో 15మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డవారిలో 9మంది మహిళలు కాగా ఆరుగురు పురుషులు ఉన్నారు. అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. 2026 మార్చి 31లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తానని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడంతో సాయుదబలగాలు వారిపై విరుచుకపడుతున్నాయి.

## జీహెచ్ఎంసి డివిజన్ల విభజనపై లొల్లి

- అభ్యంతరాలన్నీ పరిగణనలోకి తీసుకుంటాం
- జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్
- విభజన తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభ్యంతరాలు

వివరాలు 3లో

# కేంద్ర కేబినెట్‌లోకి డీకే అరుణ?



### తెలంగాణ నుండి మరొకరికి బెర్త్

తెలంగాణ, ఏపీల నుండి ఒక్కొక్కరికి ఛాన్స్

రేసులో డీకే అరుణ, లక్ష్మణ్, నగేష్

ఏపీ నుండి టీడీపీకే మరో బెర్త్

**హైదరాబాద్ -మహా:** కేంద్ర కేబినెట్ విస్తరణకు ప్రధాని నరేంద్రమోదీ వ్యూహరచన చేస్తుండగా, ఈ సారి తెలుగు రాష్ట్రాల నుండి ఒక్కొక్కరికి ఛాన్స్ దక్కే అవకాశాలు కనబడుతున్నాయి. బీహార్ పోల్ ముగియగానే, ఇందుకు సంబంధించిన కసరత్తును మోదీ ప్రారంభించగా, తాజాగా తెలుగు రాష్ట్రాల ఎంపీల భేటీతో ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీ నుండి ఎవరికి ఛాన్స్ ఇవ్వాలన్న అంశంపై ఇప్పటికే ప్రధాని మోదీ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు వార్తలు వస్తున్నాయి. తెలంగాణకు సంబంధించి ఇప్పటికే మార్పులకు డిసైడైన ప్రధాని మోదీ.. ఒకరికి స్థానం చలనం కలిగించి, కొత్తగా ఇద్దరిని తీసుకోవొచ్చని చర్చ జరుగుతోంది. పాతవారిని కొనసాగించిన పక్షంలో కొత్తగా ఒకరిని తీసుకోవొచ్చని, తెలంగాణ నుండి మాత్రం ప్రాతినిధ్యం పెరుగుతుందన్న ప్రచారం ఉన్నతస్థాయి వర్గాల్లో జరుగుతోంది.

వివరాలు 2లో

### లక్ష్మణ్, నగేష్ కూడా..

బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఓబీసీ సెల్ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ కేబినెట్ రేసులో ఉన్నారు. యూపీ నుండి రాజ్యసభకు అనూహ్యంగా ఎంపిక చేసిన బీజేపీ కేంద్ర నాయకత్వం ఇపుడు కేబినెట్ బెర్త్ కోసం కూడా పరిశీలన జరుపుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ, ఏపీలలో ఉన్న ఎస్టీ జనాభాను పరిగణనలోకి తీసుకుని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పేరును కూడా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. త్వరలో జరిగే కేబినెట్ విస్తరణలో తెలంగాణ నుండి మాత్రం ఒకరికి బెర్త్ ఖాయమని చెబుతున్నారు.

# ఢిల్లీలో సీఎం బిజీ బిజీ

9 కేంద్రీయ, 16 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి

కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌కు రేవంత్ వినతి

ఐఐఎం, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ పై కూడా..



**ఢిల్లీ, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా గడిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, నిధుల సాధన కోసం కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన సమావేశంలో, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ప్రాజెక్టు గురించి సీఎం సవివరంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 105 నియోజకవర్గాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ పాఠశాలల కోసం, అలాగే విద్యా రంగానికి మొత్తంగా రూ. 30,000 కోట్ల నిధుల అవసరాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ స్కూల్స్ కోసం తీసుకునే రుణాలను ఎస్ఆర్బీఎం నుంచి మినహాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే మానవ వనరుల అభివృద్ధికి నిజమైన పెట్టుబడిగా తెలంగాణ ముందుకు వెళ్తున్నదని, సహకరించాలని కోరారు.

**ధర్మేంద్ర ప్రధాన్ తో**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో జరిగిన భేటీలో హైదరాబాద్‌కు ప్రతిష్టాత్మకమైన 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్' మంజూరు చేయాలని

మిగతా 2లో

# లీకు చేసినోళ్ళు మెంటలోళ్ళు

### కిషన్ రెడ్డి ఫైర్



**ఢిల్లీ, మహా :** ప్రధాని మోదీ తెలంగాణ ఎంపీలతో నిర్వహించిన సమావేశ లీకులపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్ లో జరిగిన విషయాలు బయట చెప్పొద్దని ప్రధానమంత్రి చెప్పినా కూడా బయటకి చెప్పారని మండిపడ్డారు. లీకులు చేసిన వ్యక్తులు మెంటలోళ్లు.. వారెవరో చెప్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రధానమంత్రి మీటింగ్ లో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని సూచించారని చెప్పారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయమని కోరినట్టు తెలిపారు. దక్షిణ భారతదేశ నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని..బీజేపీలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. రాహుల్ గాంధీ అనైతికంగా మాట్లాడుతున్నారని, ఏ విషయాలు మాట్లాడాలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ఉండటం దురదృష్టకరమన్నారు.

## ఐపీఎల్ మినీవేలంలో.. కామెరూన్‌కు రూ.25.20 కోట్లు

### రికార్డు ధరకు కొన్న కేకేఆర్

పది ఫ్రాంచైజీలు.. 77 స్థానాల భర్తీ.. ఆంధ్ర పేసర్ పృథ్వీ రాజ్ గుజరాత్ టైటాన్స్ కు

**మహా :** అబుదాబి వేదికగా ఐపీఎల్ 2026 మినీ వేలం ముగిసింది. మొత్తం పది ఫ్రాంచైజీలు 77 స్థానాలను భర్తీ చేశాయి. ఈ వేలంలో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఆటగాడిగా ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ నిలిచాడు. రూ.25.20 కోట్ల భారీ ధరకు అతడిని కేకేఆర్ సొంతం చేసుకుంది. అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మలను రూ.14.20 కోట్ల

మిగతా 2లో



## బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు సహించం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



వివరాలు 2లో

# సౌదీకి కళ్లెం.. పాక్‌కు చుక్కెదురు!

### గల్ఫ్ పర్యటన వెనుక అసలు రహస్యం ఇదే

- అగ్రరాజ్యాలకు ప్రత్యామ్నాయంగా భారత్
- ఒమన్ నుంచి ఇథియోపియా దాకా
- మోదీ అంతర్జాతీయ వ్యూహం!
- చైనా అప్పుల వల కాదు.. అమెరికా ఆంక్షలు లేవు
- ఇది నయా భారత్ స్నేహం



PTI

**ఢిల్లీ, మహా:** ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేపట్టిన జోర్డాన్, ఒమన్, ఇథియోపియా పర్యటనలు పైకి సాధారణ దౌత్య సమావేశాలుగా కనిపిస్తున్నప్పటికీ, వీటి వెనుక లోతైన అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక వ్యూహాలు దాగి ఉన్నాయి. ఒకపక్క పాకిస్తాన్‌తో సౌదీ అరేబియా సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ, గల్ఫ్, ఆఫ్రికన్ దేశాలలో భారత్ తన పట్టును నిలుపుకోవడానికి వేసిన వ్యూహాత్మక అడుగుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. వాణిజ్య విస్తరణ, ఇంధన భద్రత, చైనా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా సాగిన ఈ పర్యటన.. అంతర్జాతీయ వేదికపై భారత్‌ను 'దక్షిణ ప్రపంచ దేశాల' (గ్లోబల్ సౌత్) నాయకుడిగా నిలబెట్టే దిశగా సాగింది. ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు ఎప్పుడూ ఒక నిర్దిష్ట లక్ష్యంతోనే సాగుతాయి. తాజాగా ఆయన చేపట్టిన మూడు దేశాల పర్యటన (ఒమన్, జోర్డాన్, ఇథియోపియా) ఇందుకు మినహాయింపు కాదు. సౌదీ అరేబియా వంటి దేశాలు పాకిస్తాన్‌తో సంబంధాలను పునరుద్ధరించుకుంటున్న ప్రస్తుత తరుణంలో, భారత్ తనదైన శైలిలో తటస్థ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం చర్చనీయాంశమైంది. కేవలం దౌత్యం మాత్రమే కాకుండా, మరో 40 దేశాలకు భారత వాణిజ్యాన్ని విస్తరించాలనే బృహత్తర ప్రణాళిక ఇందులో ఉంది.

**ఒమన్.. గల్ఫ్‌లో భారత్ నమ్మకమైన నేస్తం**

ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడటం ఈ పర్యటనలో అత్యంత కీలక పరిణామం. మధ్యప్రాచ్యంలో స్థానిక హిందూ జనాభా గణనీయంగా ఉన్న ఏకైక దేశం ఒమన్ కావడం గమనార్హం. ఇది ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధానికి అద్దం పడుతోంది.

మిగతా 2లో

# కేంద్ర కేబినెట్‌లోకి డీకే అరుణ?

**హైదరాబాద్, మహా:** కేంద్ర కేబినెట్ విస్తరణకు ప్రధాని నరేంద్రమోదీ వ్యూహరచన చేస్తుండగా, ఈ సారి తెలుగు రాష్ట్రాల నుండి ఒక్కొక్కరికి ఛాన్స్ దక్కే అవకాశాలు కనబడుతున్నాయి. బీహార్ పోల్ ముగియగానే, ఇందుకు సంబంధించిన కసరత్తును మోదీ ప్రారంభించగా, తాజాగా తెలుగు రాష్ట్రాల ఎంపీల భేటీతో ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీ నుండి ఎవరికి ఛాన్స్ ఇవ్వాలన్న అంశంపై ఇప్పటికే ప్రధాని మోదీ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు వార్తలు వస్తున్నాయి. తెలంగాణకు సంబంధించి ఇప్పటికే మార్పులకు డిసైడైన ప్రధాని మోదీ.. ఒకరికి స్థానం చలనం కలిగించి, కొత్తగా ఇద్దరిని తీసుకోవాచ్చని చర్చ జరుగుతోంది. పాతవారిని కొనసాగించిన పక్షంలో కొత్తగా ఒకరిని తీసుకోవాచ్చని, తెలంగాణ నుండి మాత్రం ప్రాతినిధ్యం పెరుగుతుందన్న ప్రచారం ఉన్నతస్థాయి వర్గాల్లో జరుగుతోంది.



**రేసులో డీకే అరుణ**

తమిళనాడు ఎన్నికల కోసం ఇప్పటికే ఇన్ ఛార్జిని నియమించిన ప్రధాని మోదీ.. ఈ దఫా విస్తరణలో తమిళనాడు నుండి అన్నామలైకు ఛాన్స్ ఇవ్వడం ఖాయమన్న చర్చ జరుగుతోంది. సంక్రాంతికి ముందే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, పార్లమెంట్ సమావేశాలు ముగిసిన వెంటనే దీనిపై స్పష్టత వస్తుందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తెలంగాణ నుండి ఈ దఫా విస్తరణలో డీకే అరుణకు ఛాన్స్ ఖాయమని చెబుతున్నారు. ముఖ్యమంత్రి జిల్లా కావడం, బలమైన మహిళా నేత కావడం, మహిళల ప్రాతినిధ్యం పెంచాలని బీజేపీ నాయకత్వం డిసైడ్ కావడంతో.. ఎపుడు విస్తరణ జరిగినా డీకే అరుణకు పదవి ఖాయమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఢిల్లీకి ఇటీవల కాలంలో వెళ్ళిన పలు నివేదికలు డీకే అరుణకు నాయకత్వాన్ని, పనితీరును ప్రశంసించేవిధంగా ఉన్నాయని అంటున్నారు. మహబూబ్ నగర్ నుండి ఎంపీగా గెలిచిన డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉండగా, ఈ టర్మ్ లో తొలి విడతలోనే ఆమె పేరు బలంగా వినిపించింది. అయితే కేబినెట్ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డిని కొనసాగిస్తూ, బెర్త్‌లను రెండుకే పరిమితం చేసింది. ఈ దఫా రేసులో డీకే అరుణ పేరు బలంగా వినపడుతోంది. వివాదరహితంగా ఉండడం, అటు కాంగ్రెస్ ను, ఇటు బీఆర్ఎస్ ను సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్న అభిప్రాయం ఉన్నతస్థాయి వర్గాల్లో ఉంది.

**కేంద్రమంత్రుల తీరుపై**

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ లు మంత్రి పదవులు ఇచ్చినా తమ రాష్ట్రాల్లోనే ఎక్కువ సమయం ఉంటున్నారని, ఇటీవల జరిగిన ఎంపీల భేటీలో మోదీ అన్నట్లు వార్తలు వచ్చాయి. ఓ మంత్రిపై ఆ శాఖ అధికారులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ క్రమంలో విస్తరణ సందర్భంగా పనితీరు చర్చకు వచ్చే అవకాశాలున్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఆశించిన ఈటల రాజేందర్ కు చివరిదాకా వస్తుందని ప్రచారం జరిగినా, బిజెపి మార్కు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత ఎంపీలలో అందరూ ప్రమోషన్ కోరుకుంటున్నారు. అయితే కేబినెట్ బెర్తా.. లేకుంటే పార్టీ పదవా? ఏదో ఒక ప్రాధాన్యం దక్కాలని ఆశిస్తున్నారు. కొండా విశ్వేశ్వరరెడ్డి, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు తదితర హేమాహేమీలంతా.. పదోన్నతి కోరుకుంటున్నారు. అయితే మోదీ, అమిత్ షాల వ్యూహం 2029 లక్ష్యంగా పలు సమీకరణలాలు బ్యాలెన్స్ చేస్తున్నట్లు చెబుతున్నారు.

**ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో..**

వచ్చే ఏడాది తమిళనాడు, బెంగాలెం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నందున.. ఆయా రాష్ట్రాలకు చెందిన నేతలను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రధాని మోదీ ఆలోచిస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో ఏపీకి మరో మంత్రి పదవి ఇవ్వాలని ప్రధాని భావిస్తున్నట్లు చెబుతున్నారు. కేంద్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఏపీ నుంచి ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఒకరు కేబినెట్ మంత్రి కాగా, మిగిలిన ఇద్దరు సహాయ మంత్రులు. అదే విధంగా టీడీపీకి రెండు బీజేపీకి ఒకటి చొప్పున మంత్రి పదవులు దక్కాయి. ఏపీ నుంచి ఎన్డీఏ కూటమిలో జనసేన కూడా కీలక భాగస్వామిగా ఉన్నా ఆ పార్టీకి మంత్రి పదవి దక్కలేదు. రాష్ట్రంలో జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. దీంతో తాజాగా చేపట్టే విస్తరణలో ప్రధాని ఏ పార్టీకి అవకాశం ఇస్తారనేది ఆసక్తికర చర్చకు తావిస్తోంది.

**ఏపీ నుండి టీడీపీకే**

ఏపీ నుంచి కాబోయే కేంద్ర మంత్రి టీడీపీ నుంచే ఉంటారని అంటున్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన నేతను ఎంపిక చేయాలన్న సూచనలు వస్తున్నట్లు చెబుతున్నారు. రెడ్డి సామాజికవర్గాన్ని ఆకర్షించేందుకు ఆ సామాజికవర్గానికి కేంద్ర కేబినెట్‌లోకి పంపాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. చంద్రబాబు ఆలోచనలు నిజమైతే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఎంపీ డాక్టర్ శబరి మధ్య కేబినెట్ మంత్రి పదవికి పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అదే సమయంలో ఎస్సీ కోటాలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేరును పరిశీలిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి కేబినెట్ విస్తరణ ఎప్పుడు జరిగినా ఏపీ నుంచి ఒకరికి చాన్స్ వస్తుందన్న ప్రచారం ఎంపీల్లో ఆశలు పెంచేస్తోంది.

## 21న కేసీఆర్ భేటీ

### పాలమూరులో సభకు వ్యూహారచన

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించాల్సిన అత్యవసర సమావేశం ఈ నెల 21కి వాయిదా పడింది. పార్టీని తిరిగి గాడిలో పెట్టేందుకు, అధికార కాంగ్రెస్ పార్టీపై పోరు ఉధృతం చేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నిర్వహించాల్సిన కీలక సమావేశం ఎంపీలు కూడా హాజరుకావాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు. 19వ తేదీతో పార్లమెంట్ ముగియనుంది. కాగా జనవరి లో క్రిష్ణా జలాలపై పోరుకోసం పాలమూరు లో సభ నిర్వహించే యోచనలో కేసీఆర్ ఉన్నారు. జనవరి నెలాఖరులో దీనిని నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. 21న సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

## కృష్ణయ్య.. నాటకాలు ఎందుకయ్యా?

### సీపీఐ నారాయణ ఆగ్రహం

**ఢిల్లీ, మహా:** బీజేపీ ఎంపీ ఆర్ కృష్ణయ్యపై సీపీఐ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి పంపిస్తే కేంద్రం అడ్డుకుంటుందని, తాను బీసీని అని చెప్పుకునే ప్రధాని మోదీ ఎందుకు దీన్ని అడ్డుకుంటున్నారు? అని నారాయణ ప్రశ్నించారు. బీజేపీ తరపున ఎంపీగా ఉన్న ఆర్ కృష్ణయ్య ఎందుకు నాటకాలు ఆడుతున్నారు? బీజేపీ సంకలో ఉండి బీసీ ఉద్యమానికి కృష్ణయ్య న్యాయం చేయడం లేదని, పార్లమెంట్‌లో ఉన్న కృష్ణయ్య బీసీ ఉద్యమానికి మద్దతు తెలిపే పార్టీలను, నాయకులను ఎందుకు కలిసి ఏకతాటి పైకి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యులతో కలిసి ధర్నా చేస్తే సీపీఐ కూడా మద్దతు ఇస్తుందన్నారు.



## మెస్సీ దెబ్బకు క్రీడా మంత్రి ఔట్

### రాజీనామా చేయించిన మమత

**కోల్ కత:** మెస్సీ దెబ్బకు ఓ క్రీడా మంత్రి ఔటయ్యారు. ఇటీవల అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ రాక సందర్భంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో చోటు చేసుకున్న విధ్వంసానికి బాధ్యత వహిస్తూ క్రీడాశాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ రాజీనామా చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేయగా దాన్ని సీఎం మమతా బెనర్జీ ఆమోదించారు. ఈనెల 13వ తేదీన తేదీన బెంగాల్లో మెస్సి రాక సందర్భంగా చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో సీఎం మమత బెనర్జీ చర్యలు తీసుకున్నారు. నిర్వహణ సరిగా చేయలేక మమతాబెనర్జీ సర్కారు అప్రతిష్టపాలైంది. దీంతో నష్టనివారణ చర్యలు ప్రారంభించింది.

## ఐపీఎల్ మినీవేలంలో.. కామెరూన్‌కు రూ.25.20 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రికార్డు ధరకు సీఎస్‌కే కొనుగోలు చేసుకుంది. వారిద్దరి కోసమే చెన్నై రూ.28 కోట్ల పైగా ఖర్చు చేసింది. ఆంధ్ర పేసర్ పృథ్వీ రాజ్ యర్రాను రూ.30 లక్షల కనీస ధరకు గుజరాత్ టైటాన్స్ సొంతం చేసుకుంది. పృథ్వీ షాను రూ.75 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. హైదరాబాద్ ఆటగాడు అమన్ రావు పేరాలను రూ.30 లక్షలకు రాజస్తాన్ రాయల్స్ తీసుకుంది. ఆసీస్ వికెట్ కీపర్ బ్యాటర్ జోష్ ఇంగ్లిష్‌ను రూ.8.60 కోట్ల భారీ ధరకు లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. లుంగీ ఎంగిడిని రూ.2 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది. రాహుల్ చాహర్‌ను రూ.5.20 కోట్లకు సీఎస్‌కే సొంతం చేసుకుంది.

## గాంధీ అంటే మోడీకి నచ్చదు.. అందుకే పేరు మార్పు

### రాహుల్ గాంధీ ఫైర్

**మహా :** మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ పేరు మార్చే బిల్లుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు రెండూ నచ్చవని, అందుకే ఈ పేరు మార్పు కార్యక్రమం అని విమర్శించారు. ఈ పథకం గాంధీజీ గ్రామ స్వరాజ్యం భావనల ప్రతిరూపమని, గ్రామీణ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గత 10 ఏళ్లుగా ఈ పథకాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించిందని, ఇప్పుడు పూర్తిగా తుడిచిపెట్టే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. గాంధీ పేరు తొలగించడం ఆయన ఆదర్శాలకు అవమానమని రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ కూడా కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు.

## ఢిల్లీలో సీఎం బిజీ బిజీ

### 9 కేంద్రీయ, 16 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి

### కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌కు రేవంత్ వినతి

### ఐఐఎం, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ పై కూడా..

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కోరారు. దేశంలోని అన్ని ప్రధాన రాష్ట్రాల్లో ఐఐఎంలు ఉన్నాయని, ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్‌కు కూడా ఐఐఎం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించినట్లు కేంద్ర మంత్రికి తెలిపారు. వెంటనే తరగతులు ప్రారంభించడానికి ట్రాన్సిట్ క్యాంపస్ కూడా సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి వివరించారు. ఐఐఎం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తే అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆయా కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. సానకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ యంగ్ ఇండియా స్కూల్స్ ప్రాజెక్టు డీపీఆర్ పంపాలని రేవంత్‌కు చెప్పారు. డీపీఆర్‌ను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ప్రదాన్ చెప్పినట్టు ఆయనతో భేటీ తర్వాత ముఖ్యమంత్రి వివరించారు.

## శభాష్.. రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్' అంతర్జాతీయ సదస్సు విజయవంతమైన తీరును సీఎం రేవంత్ రెడ్డి.. సోనియా గాంధీకి తెలియజేశారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి వచ్చిన సానుకూల స్పందన, పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గత రెండేళ్లుగా 'ప్రజా పాలన'లో భాగంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అవి లబ్ధిదారులకు చేరుతున్న తీరును సీఎం వివరించారు. కేవలం సంక్షేమమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణను సోనియా గాంధీ ముందుంచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ విన్న అనంతరం.. తెలంగాణలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వ పనితీరుపై సోనియా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' నివేదికకు అనుగుణంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## సౌదీకి కళ్లెం.. పాక్‌కు చుక్కెదురు!

(మొదటిపేజీ తరువాయి)

ఖతార్ వంటి దేశాలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుండగా, ఒమన్ మాత్రం ఎప్పుడూ తటస్థ వైఖరినే పాటిస్తోంది. ఇజ్రాయెల్, ఇరాన్ వంటి దేశాల ఘర్షణల ప్రభావం తమ దేశంపై పడకుండా, శాంతియుత వాతావరణాన్ని కోరుకునే ఒమన్, భారత్‌కు అత్యంత నమ్మదగ్గ భాగస్వామిగా మారింది.

**జోర్డాన్, ఇథియోపియా.. భవిష్యత్ వాణిజ్య ద్వారాలు**

అటు జోర్డాన్, ఇటు ఇథియోపియాలు సైతం భారత్ వ్యూహంలో భాగమే. పాలస్తీనాతో స్నేహం చేస్తూనే, ఇజ్రాయెల్‌తోనూ సంబంధాలు నెరపుతున్న విలక్షణమైన దేశం జోర్డాన్. భవిష్యత్తులో "భారత్‌మధ్య ప్రాచ్యంఐరోపా ఆర్థిక నడవ" కార్యరూపం దాల్చితే, జోర్డాన్ పాత్ర అందులో కీలకం కానుంది. ఇక ఆఫ్రికాలో భారత్ విస్తరణకు ఇథియోపియా ఒక ముఖద్వారం లాంటిది. 2024లో 'బ్రిక్స్' కూటమిలో ఇథియోపియా చేరడం, ఆఫ్రికన్ యూనియన్‌ను 'జి20'లో భారత్ చేర్చించడం వంటి పరిణామాలు ఆఫ్రికా దేశాల్లో భారత్ పట్ల సానుకూలతను పెంచాయి.

***అగ్రరాజ్యాలకు ప్రత్యామ్నాయంగా..***

ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు ఇచ్చే రుణాలకు రాజకీయ షరతులు ఉంటాయి. మరోవైపు చైనా ఇచ్చే రుణాలతో 'బెల్ట్ అండ్ రోడ్' పేరుతో దేశాలను అప్పుల ఊబిలో దించుతోంది. కానీ, భారత్ ఈ రెండు విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఏ దేశ అంతర్గత రాజకీయాల్లోనూ జోక్యం చేసుకోకుండా, కేవలం అభివృద్ధి భాగస్వామిగా మాత్రమే ఉండటంతో చిన్న దేశాలు భారత్ వైపు ఆకర్షితులవుతున్నాయి. ఇది వర్ధమాన దేశాలకు భారత్‌ను ఒక ఆశాకిరణంగా మార్చింది.

**రక్షణ, వైద్య రంగాల్లో లబ్ధి**

ఈ దౌత్య సంబంధాల వల్ల భారత్‌కు ఆర్థికంగానూ భారీ ప్రయోజనాలు ఉన్నాయి. భారతీయ రక్షణ పరికరాలను కొనుగోలు చేయడానికి ఈ దేశాలు ఆసక్తి చూపిస్తుండగా, వైద్యం కోసం పాశ్చాత్య దేశాల కంటే తక్కువ ఖర్చుతో కూడిన భారత్‌ను ఎంచుకుంటున్నాయి. వైద్య పర్యాటకం, రక్షణ ఎగుమతులు పెరగడానికి ఈ పర్యటనలు దోహదపడనున్నాయి. మొత్తంగా చూస్తే, మోదీ పర్యటన కేవలం స్నేహపూర్వకమే కాదు, భవిష్యత్ భౌగోళిక రాజకీయాల్లో భారత్ స్థానాన్ని సుస్థిరం చేసే ఒక గొప్ప ప్రయత్నమని చెప్పక తప్పదు.

## ఆస్ట్రేలియా బీచ్‌లో కాల్పులు

### హైదరాబాద్‌తో నిందితుడు సాజిద్ కు లింకులు

**మహా :** ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండి బీచ్ వద్ద కాల్పులు జరిపిన సాజిద్ అక్రమ్ వద్ద భారత పాస్‌పోర్ట్ ఉన్నట్లు ఆస్ట్రేలియా అధికారులు వెల్లడించారు. సాజిద్ అక్రమ్ హైదరాబాద్ నుంచి పాస్‌పోర్ట్ పొందినట్లు గుర్తించారు. సాజిద్ మూలాలు హైదరాబాద్‌లోనే ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఓ డిగ్రీ కాలేజీలో బీకామ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 1998లో ఉద్యోగ అన్వేషణలో భాగంగా ఆస్ట్రేలియా వలస వెళ్లినట్లు పేర్కొన్నారు. అక్కడ యూరప్ సంతితికి చెందిన వెనెరా గ్రోస్సోను వివాహం చేసుకుని స్థిరపడినట్లు వివరించారు. సాజిద్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. కాల్పుల్లో మరో నిందితుడిగా ఉన్న కుమారుడు నవీద్‌తోపాటు కుమార్తె సైతం ఆస్ట్రేలియాలోనే జన్మించినట్లు వెల్లడించారు. వారిద్దరికి ఆస్ట్రేలియన్ పౌరసత్వం ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. సాజిద్‌కు హైదరాబాద్‌లోని తన బంధువులతో అంతంత మాత్రమే సంబంధాలు కొనసాగించినట్లు ఆస్ట్రేలియన్ అధికారులు గుర్తించారు. గత 27 ఏళ్లలో సాజిద్ ఆరుసార్లు హైదరాబాద్‌కు వచ్చాడని, చివరిసారిగా 2022లో వచ్చినట్లు చెప్పారు. తొలుత కుటుంబం ఆస్తిపరమైన అంశాల వల్ల హైదరాబాద్‌లోని తన తల్లిదండ్రులను కలిసినట్లు పేర్కొన్నారు. తర్వాత భారత్‌కు వెళ్లకూడదని సాజిద్ నిర్ణయించికున్నట్లు తెలిపారు. తన తండ్రి మృతి చెందినా అతను హైదరాబాద్‌కు రాలేదని వివరించారు. సాజిద్‌కు ఉగ్రవాద భావజాలం ఉన్నట్లు తెలియదని అతని కుటుంబ సభ్యులు తెలిపినట్లు చెప్పారు.

**ఉగ్రదాడిలో 16 మంది బలి**

సిడ్నీలోని బోండీ బీచ్‌లో హనుక్కా వేడుకలు జరుపుకుంటున్నవారిపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలో 16 మంది ప్రాణాలు విడిచారు. కాల్పులు జరిపిన సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్‌లు తండ్రీకొడుకులని పోలీసులు గుర్తించారు. సాజిద్ స్థానికంగా పండ్ల దుకాణం నడుపుతుండగా, నవీద్ రెండు నెలల కిందటే ఉద్యోగం కోల్పోయినట్లు వెల్లడించారు. చేపల వేటకు వెళ్తున్నామని వీరిద్దరూ కుటుంబసభ్యులకు చెప్పినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో సాజిద్ చావగా, నవీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## సింగరేణి సీఎండిగా కృష్ణభాస్కర్

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర రెవెన్యూ సర్వీసు విభాగానికి చెందిన ఎన్. బలరాం గతంలో కేంద్రం నుంచి ప్రత్యేక విధుల్లో భాగంగా (డిప్యుటేషన్‌పై) తెలంగాణకు వచ్చారు. సింగరేణిలో ఆయన ప్రస్థానం సుదీర్ఘంగా సాగింది. తొలుత సంచాలకుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, అనంతరం ఇన్‌ఛార్జి సీఎండీగా పదోన్నతి పొందారు. మొత్తంగా ఆయన సింగరేణి సంస్థలో ఆరేళ్ల పాటు కీలక సేవలందించారు. సాధారణంగా కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి వచ్చే అధికారుల గడువు ఐదేళ్లు మాత్రమే ఉంటుంది. అయితే బలరాం విషయంలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా మరో ఏడాది పాటు అదనంగా కొనసాగే అవకాశం లభించింది. ప్రస్తుతం ఆ ఆరేళ్ల గడువు కూడా పూర్తి కావడంతో నిబంధనల ప్రకారం ఆయన తిరిగి కేంద్ర సర్వీసులకు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పటికే గరిష్ఠ గడువు ముగిసినందున.. మరోసారి పొడిగింపు కోరుతూ కేంద్రానికి లేఖ రాయకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్‌కు సింగరేణి పగ్గాలు అప్పగించారు.

## గీతం డీమ్డ్ యూనివర్సిటీ రూ.118కోట్ల బకాయిలా?

### ఎందుకు వసూలుచేయలేదంటూ హైకోర్టు ఫైర్

**హైదరాబాద్, మహా:** గీతం డీమ్డ్ యూనివర్సిటీ విద్యుత్ బకాయిలపై తెలంగాణ విద్యుత్‌శాఖ అధికారులపై హైకోర్టు మండిపడింది. సామాన్యులు రూ.1000 బకాయిలు ఉంటే ముక్కు పిండి వసూలు చేసే విద్యుత్ అధికారులు రూ.వందల కోట్ల బకాయిలు ఉన్నా.. ఎందుకు వసూలు చేయలేదంటూ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. వాస్తవానికి హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని ఎస్పీడీసీఎల్ నోటీసులు పంపింది. 2008 నుంచి ఇప్పటి వరకు రూ.118కోట్ల వరకు బిల్లులు చెల్లించలేదంటూ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, ఎస్పీడీసీఎల్ నోటీసులను గీతం యూనివర్సిటీ హైకోర్టులో సవాల్ చేసింది. అయితే, యూనివర్సిటీ దాఖలు చేసిన జస్టిస్ నగేశ్ భీమపాక బెంచ్ 2008 నుంచి బిల్లులు చెల్లించకపోవడంతోపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు రూ.1000 బిల్లు కట్టకపోతేనే కరెంట్ కనెక్షన్‌ను తొలగిస్తున్నారని.. అలాంటిది యూనివర్సిటీకి మాత్రం ఎందుకు ప్రత్యేకంగా వెసులుబాటు కల్పించారని ప్రశ్నించారు. ఈ అంశంపై పూర్తి వివరాలు ఇవ్వాలని.. సూపరింటెండెంట్ ఇంజినీర్ వ్యక్తిగతంగా హాజరుకావాలని బెంచ్ ఆదేశించింది. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

## మా ఆదివాసీ దేవుళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు

### మంత్రి సీతక్క హెచ్చరిక

**హైదరాబాద్, మహా :** మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క హెచ్చరించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్కసారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇలాంటి వాటిని తాము సహించేది లేదని స్పష్టం చేశారు. ఇళ్ల విషయంలో బీఆర్ఎస్ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటి వరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని ఆమె అన్నారు. గ్రామాలకు పూర్తిస్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు.



పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదని బీఆర్ఎస్ పార్టీని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో కొన్ని వేల ఇళ్లను ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్ 1, గ్రూప్2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారిందని విమర్శించారు. కొంతమంది నీచమైన రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు సహించం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా :** గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని అన్నారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేండ్లుగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు.



**బీఆర్ఎస్ సర్పంచ్ లకు సన్మానం**

మంగళవారం తెలంగాణ భవన్‌లో ఖానాపూర్, షాద్ నగర్ నియోజకవర్గాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు.

## ఒక్క పాట.. 100 రికార్డులు బద్దలు

### చికిరి చికిరి ట్రెండ్

**మహా:** గ్లోబల్ స్టార్‌రామ్‌చరణ్‌నటిస్తున్న 'పెద్ది' సినిమా నుంచి విడుదలైన 'చికిరి చికిరి' సాంగ్ రికార్డు స్థాయి వ్యూస్ తో దూసుకెళ్తోంది. ఈ సాంగ్.. విడుదలైన కేవలం ఒక నెలలోనే తెలుగు వెర్షన్ ఒక్కటే 100 మిలియన్ల (పది కోట్లు) వ్యూస్‌ను దాటేసింది. అంతేకాకుండా, ఈ సాంగ్ ను విడుదల చేసిన ఐదు భాషల్లో కలిపి మొత్తం 150 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించింది. 'పెద్ది' మూవీలోని 'చికిరి చికిరి' సాంగ్ ఇప్పుడు వరల్డ్ ట్రెండ్ గా దూసుకెళ్తోంది. ఈ సాంగ్ లోని హుక్ స్టెప్ ను ప్రతి ఒక్కరూ ఇమిటేట్ చేస్తూ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. రామ్ చరణ్ గ్రేస్, డ్యాన్స్, లుక్స్ ఆడియెన్స్ కు తెగ నచ్చేశాయి. యూట్యూబ్ షార్ట్స్ అయినా.. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఇలా ఏ సామాజిక మాధ్యమమైనా చికిరి చికిరి సాంగ్ దర్శనమిస్తోంది. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమాను రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది.





## క్షేత్రపాలకునికి పంచామృత అభిషేకము

**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మండలంలోని బూరుగడ్డ శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రములో మంగళవారం క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకము, 108 తమల పాకులచే ఆకుపూజ, గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదనలతో పూలదండ అలంకరణ సహిత పూజా కార్యక్రమమును భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు కార్యక్రమానికి ములుగు లింగం బాబు సత్యవతి దంపతులు,సహకరించారు. ప్రతి మంగళవారం స్వామివారికి గూడెపూ శ్రీనివాస్ ధర్మపత్ని సీతమ్మ దంపతులు, మంచాల శ్రీధర్ ధర్మపత్ని కవిత దంపతులు పూలదండ సమర్పించుకుంటారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణ రావు,అర్చకులు ముదుంబై హరీష్ కుమారాచార్యులు శ్రీనివాసచార్యులు వెంకటరెడ్డి సత్యబాబు వెంకట్ నారాయణ సత్యనారాయణ రమణ మమత సక్కుబాయమ్మ పల్లవిఆలయ సిబ్బంది, వై కిరణ్ గౌడ్ జి శ్రీనివాస్ రెడ్డి వై రమేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసి డివిజన్ల విభజనపై లొల్లి

**అభ్యంతరాలన్నీ పరిగణనలోకి తీసుకుంటాం.. జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్.. విభజన తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభ్యంతరాలు**




**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడంతో.. పరిపాలన సౌలభ్యం కోసం చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియపై జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కీలక వివరాలను వెల్లడించారు. ఈ విభజన కేవలం ప్రస్తుత అవసరాల కోసమే కాకుండా.. భవిష్యత్తులో పెరగబోయే జనాభాను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అంటే ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఇలా వేర్వేరు పాలనా వ్యవస్థలు ఉండేవి. అయితే.. ఇప్పుడు వాటన్నింటినీ కలిపి ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో జీహెచ్ఎంసీ పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుండి 2060 చదరపు కిలోమీటర్లకు పెరిగిందని, దీని వల్లనే వార్డుల పెంపు జరిగిందన్నారు. దీంతో దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన కార్పొరేషన్‌గా హైదరాబాద్ అవతరించిందన్నారు. అందుకే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో వార్డుల హద్దులను నిర్ణయించారు. వార్డుల పునర్విభజన కేవలం అంకెలకు పరిమితం కాకుండా.. భౌగోళిక పరిస్థితులను బట్టి చేశామన్నారు. రైల్వే లైన్లు, ప్రధాన రహదారులు, నాలాలను హద్దులుగా తీసుకున్నట్లు తెలిపారు. గతంలో కొన్ని వార్డులు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉండేవని, ఇప్పుడు అటువంటి సమస్య లేకుండా ఒకే నియోజకవర్గ పరిధిలోకి వచ్చేలా జాగ్రత్త పడ్డామన్నారు. ఉదాహరణకు తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం జనాభా తక్కువగా ఉన్నా.. రాబోయే ఐదేళ్లలో అక్కడ భారీ అపార్ట్‌మెంట్లు, కట్టడాల వల్ల జనాభా 4 లక్షలు దాటే అవకాశం ఉందని, అందుకే అటువంటి చోట్ల వార్డుల సంఖ్యను పెంచామని, వార్డుల విభజనపై వచ్చిన ప్రతీ అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. వార్డుల పేర్లు మార్చాలని, అలాగే కొన్ని ప్రాంతాల్లో సరిహద్దులపై అభ్యంతరాలు ఎక్కువగా వచ్చాయని, లిఖితపూర్వక అభ్యంతరాలు సమర్పించడానికి బుధవారం ఆఖరి రోజన్నారు. నగర విస్తీర్ణం పెరగడంతో చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ ఎమ్మెల్యేలను కూడా కౌన్సిల్ సమావేశాలకు ఆహ్వానించారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభ్యంతరాలు

కాగా విభజన జరిగిన తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజనలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్లో దాదాపు 80,వేల ఓట్లు ఉంటాయి, ఇతర డివిజన్ లతో పోల్చుకుంటే మూడు డివిజన్లను చేయాలన్నారు. చిన్నగా ఉన్న నార్సింగ్ మున్సిపాలిటీని మూడు డివిజన్లుగా చేశారని దుయ్యబట్టారు. మణికొండ ప్రాంతంలో 60 వేలకు పైగా జనాభా ఉన్న రెండు డివిజన్లకు మాత్రమే పరిమితం చేశారని వాపోయారు. మరోసారి డివిజన్ల పునర్విభజనలో జరిగిన సరిహద్దు లోపాలు సరిచేయాలని కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.



## అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీరె

**యాదగిరిగుట్ట, మహా:** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం యాదగిరిగుట్ట శ్రీ స్వామివారికి మంగళవారం సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ శ్రీ స్వామివారికి ప్రత్యేకించి తయారు చేసిన అగ్గిపెట్టెలో పట్టే రెండు గ్రాముల బంగారు చీరను ఆలయ ప్రధాన అర్చకులు మరియు ఆలయ ఏఈఓకు అందజేశారు. చీరె పొడవు 5:30 మీటర్లు వెడల్పు 48 ఇంచులు వుంది.



### మహేష్ కుమార్ గౌడ్ ను సన్మానించిన

## పార్టీ ఎస్సీ సెల్ నాయకులు

**యాదాద్రి భువనగిరి, మహా:** తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు నగరి గారి ప్రీతం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని శబరి గెస్ట్ హౌస్ లో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి అంబేద్కర్ చిత్రపటం అందజేసి శాలువాలతో సత్కరించిన ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యవర్గం... ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్ తదితరులు ఉన్నారు.



## చలి ప్రభావం దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**జిల్లా ఎస్పీ నరసింహ**

**సూర్యాపేట జిల్లా మహా:** రాబోయే రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో కోల్డ్ వేవ్స్ ఉంటాయని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరించిందని దీని కారణంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా తీవ్ర చలి, పొగమంచు ఏర్పడే అవకాశం ఉన్నది కావున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పి నరసింహ తెలిపారు.జిల్లాల్లో దట్టమైన పొగమంచు, కోల్డ్ వేవ్ దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయపు సమయాల్లో హైవేలపై ప్రయాణించే వారు జాగ్రత్తలు పాటించాల్సిందిగా కోరారు. తెల్లవారుజామున ప్రయాణాలు చేయడం వాయిదా వేసుకోవడం మంచిది సూచించారు. వాహనాలు మంచి లైటింగ్ కడిషన్ ఉండాలని అన్నారు, ఇండికేటర్స్ ఉపయోగించాలి, రోడ్డుపై ఒక వరసలో వెళ్ళాలి అని కోరారు. తక్కువ వేగంతో డ్రైవ్ చేయాలి, పాటలు మ్యూజిక్ పెట్టుకోవద్దు, ఓవర్ టేక్ చేయొద్దు, కచ్చితమైన మార్గంలో ఒకే లైన్ లో వాహనం నడపాలి, పదే పదే లైన్ క్రాస్ చేయొద్దు, ఇండికేటర్ ను వెయ్యాలి, వాహనాల మధ్యలో దూరం పాటించాలి, హారన్స్, వాహన శబ్దాలను గుర్తించాలి, ఇతర వాహన డ్రైవర్ లను ఇబ్బంది పెట్టకుండా అనుసరించాలి, రోడ్లపై పరిస్థితులు గమనించాలి అని కోరారు. సురక్షితంగా ప్రయాణించి గమ్యం చేరుకావాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## గాంధీ అంటే మోడీకి నచ్చదు.. అందుకే పేరు మార్పు

**రాహుల్ గాంధీ ఫైర్**



**మహా :** మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ పేరు మార్చే బిల్లుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు రెండూ నచ్చవని, అందుకే ఈ పేరు మార్పు కార్యక్రమం అని విమర్శించారు. ఈ పథకం గాంధీజీ గ్రామ స్వరాజ్యం భావనల ప్రతిరూపమని, గ్రామీణ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గత 10 ఏళ్లుగా ఈ పథకాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించిందని, ఇప్పుడు పూర్తిగా తుడిచిపెట్టే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. గాంధీ పేరు తొలగించడం ఆయన ఆదర్శాలకు అవమానమని రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ కూడా కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు.

# ఇంటర్ పరీక్షల్లో మార్పులు

**అలర్ట్ చేసిన విద్యాశాఖ**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి 2026 మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా ప్రకటించిన ప్రణాళిక ప్రకారం మార్చి 3వ తేదీన జరగాల్సిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు బోర్డు కార్యదర్శి అధికారికంగా ప్రకటించారు. ఈ తేదీ మార్పునకు ప్రధాన కారణం హోలీ పండుగ అని అధికారులు తెలిపారు. మార్చి 3వ తేదీన దేశవ్యాప్తంగా హోలీ పండుగ జరగనున్న నేపథ్యంలో, విద్యార్థులకు రవాణా పరంగా గానీ, ఇతరత్రా ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మార్చి 3న జరగాల్సిన ద్వితీయ సంవత్సరం గణితం 2ఏ, వృక్షశాస్త్రం, రాజనీతి శాస్త్రం పరీక్షలను మార్చి 4వ తేదీన (బుధవారం) నిర్వహించనున్నారు. ఈ మార్పు కేవలం పైన పేర్కొన్న సబ్జెక్టులకు మాత్రమే వర్తిస్తుందని, మిగిలిన పరీక్షలన్నీ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా కొనసాగుతాయని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షల సమయాల్లో కూడా ఎటువంటి మార్పు ఉండదు; ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయి. అలాగే, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల తేదీల్లో ఎటువంటి మార్పు లేదని అధికారులు వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని, సవరించిన తేదీని దృష్టిలో ఉంచుకుని తమ సన్నద్ధతను కొనసాగించాలని బోర్డు సూచించింది. తాజా సమాచారం కోసం విద్యార్థులు ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని అధికారులు తెలిపారు.

# నేడు తుదివిడత పంచాయతీ

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో బుధవారం తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 182 మండలాల్లోని 4,157 గ్రామ పంచాయతీలు, 28,406 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. కాగా ఇందులో ఇప్పటికే 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మొదటి రెండు విడతలలో కాంగ్రెస్ పార్టీ గరిష్టంగా పంచాయతీలు గెలుచుకుంది.

**మొదటి, రెండో విడతలో**

| | | |
|---|---|---|
| కాంగ్రెస్ | 5246 | (61.24%). |
| బీఆర్ఎస్ | 2329 | (27.19%). |
| బీజేపీ | 500 | (5.84%). |
| ఇతరులు | 467 | (5.45%) |

## రోడ్డుపై లారీ డ్రైవర్ల ఘర్షణ.. కాల్పుల్లో ఒక డ్రైవర్ మృతి



**నిజామాబాద్, మహా :** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని దేవీతండా సమీపంలో జాతీయ రహదారి 44 పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద దారుణ ఘటన చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు దుండగులు కాల్పులు జరిపి, మహమ్మద్ సల్మాన్ (48) అనే డ్రైవర్‌ను హతమార్చారు. సల్మాన్ తన లారీని పెట్రోల్ బంక్ వద్ద నిలిపి ఉంచిన సమయంలో మరో లారీలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన సల్మాన్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందాడు. దుండగులు తమ లారీని చంద్రాయన్‌పల్లి వరకు తీసుకెళ్లి అక్కడ వదిలివేసినట్టు సమాచారం. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దుండగులను పట్టుకోవడానికి గాలింపు చర్యలు జరుపుతున్నారు. లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ ఇంత అనర్థానికి దారితీయడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### పర్యావరణ హిత

## పోలింగ్ కేంద్రాలు

**యాదాద్రి భువనగిరి, మహా:** మూడవ విడత పోలింగ్కి సిద్ధం, పర్యావరణ హిత పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హనుమంతరావు యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామ పంచాయతి ఎన్నికల్లో భాగంగా అడ్డగూడూరు,మోత్కూరు,మోటకొండూర్,గుండాల , చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లో మూడవ విడత పోలింగ్ కి పకడ్బందీగా ఏర్పాట్లు చేసామని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో , అడ్డగూడూరు మండలం చౌళ్ల రామారం గ్రామంలో ఆదర్శ పోలింగ్ కేంద్రం లో ఏర్పాట్లు పరిశీలించారు పోలింగ్ బూత్ బయట ఇపుడే గుర్తులతో కూడిన ఫారం9 ని అతికించుకోవాలి , ఓటింగ్ కంపార్ట్మెంట్ కూడా ఏర్పాటు చేయాలి. రేపు ఉదయాన్నే 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ మొదలుపెట్టాలి అని చెప్పారు. ఈ ఆదర్శ పోలింగ్ కేంద్రాలలో మట్టి కుండలో నీళ్లు, పోలింగ్ కేంద్రాల ముందు రంగవల్లులు, పండుగ లాంటి వాతావరణం ల పచ్చని మొక్కల్తో, కొబ్బరి మట్టలు, పూలతో అలంకరణలు , అరటి ఆకులతో సెల్ఫీ పాయింట్ లు , గ్రీన్ మ్యాట్ లు వేసి అవగాహన కల్పించడం జరుగుతుంది అని అన్నారు 6 మండలాల్లో ఆదర్శ పోలింగ్ కేంద్రాలుఅడ్డగూడూరు మండలం చౌళ్ల రామారం, మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో, గుండాల మండలం పాచిల్ల గ్రామంలో, మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డి గూడెం లో,చౌటుప్పల్ మండలం అరెగూడెం గ్రామంలో, నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగింది

# నేడు మూడో విడత పంచాయతీ ఎన్నికలు





**ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, సీపీ**

**కరీంనగర్ , మహా :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 19 మండలాల పరిధిలో మూడో విడత ఎన్నికలు బుధవారం జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 388 గ్రామపంచాయతీలు, 1,580 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు మండలాల్లో జగిత్యాల జిల్లాలోని బుగ్గారం, ఎండపల్లి, గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూరు, సిరిసిల్ల జిల్లాలో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లిలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల్లో 1580మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలో 111 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా 108 స్థానాల్లో పోటీకి 454మంది బరిలో నిలిచారు. హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంట, సైదాపూర్, వీణవంక మండలాల్లోని 108 సర్పంచ్, 1034 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఐదు మండలాల్లో 1,59,647 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సిరిసిల్లలో 87 జీపీలకు ఏకగ్రీవం కాగా 80 స్థానాలకు 379 మంది, జగిత్యాలలో 119 జీపీల్లో 6 ఏకగ్రీవం కాగా 113 స్థానాలకు 456మంది పోటీ పడుతున్నారు. పెద్దపల్లిలో 91 జీపీల్లో 6 ఏకగ్రీవం కాగా 85 స్థానాలకు 294మంది రేసులో ఉన్నారు.

**ఎన్నికలు పక్కాగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

మూడో(చివరి)విడత గ్రామపంచాయతీ ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

**పటిష్టమైన భద్రతా : సీపీ గౌష్ ఆలం**

గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల బందోబస్తు ప్రణాళిక వివరాలను వెల్లడించారు. ప్రతీ మండలానికి ఒక ఏసీపీ అధికారిని కేటాయించామని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ఎక్కువ పోలింగ్ కేంద్రాలు గల మండలాలలో ఇద్దరు ఏసీపీ లను సైతం కేటాయించామని తెలిపారు. బందోబస్తు కోసం దాదాపు 877 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో 6 ఏసీపీలు, 20 ఇన్‌స్పెక్టర్లు, 39 ఎస్సైలు, 40 ఏఎస్సై/ హెడ్ కానిస్టేబుల్స్, 460 కానిస్టేబుళ్ళు, 35 స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు, 178హోంగార్డ్స్‌తో 100మంది బెటాలియన్ స్పెషల్ పోలీసులతో పాటుగా అదనంగా ఎన్.సి.సి. సభ్యులను కూడా వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు.

# గెలిచింది.. హామీని నెరవేర్చింది..

**కందికట్కూర్ కొత్త సర్పంచ్ విజయమ్మ రికార్డు..**



**కరీంనగర్ మహా :** ఎన్నికల్లో ఓట్ల వేటలో నేతలు హామీలు మామూలే. కొందరు వాటిని నెరవేరుస్తుంటారు. మరి కొందరు మర్చిపోతుంటారు.. ఏళ్లకేండ్లు గడిచిన హామీల ఊసేత్తారు. ప్రజలకు నిత్యం ఏదో చెబుతూ బుకాయిస్తూ కాలం గడుపుతుంటారు. కానీ వినూత్న పంథాలో సర్పంచ్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కోతుల బాధను పూర్తిగా తీరుస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు అండగా నిలిచారు ఆశీర్వదించారు. ఈనెల 14వ తేదీన జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఆ గ్రామానికి సర్పంచ్ గా ఎన్నికైంది. తన ప్రజలకు ఇచ్చిన తన హామీని నిలబెట్టుకోవాలని ఉద్దేశంతో తెల్లవారే కార్యరంగంలోకి దూకారు. కోతుల బాధను తీర్చేందుకు కోతులపట్టే వారిని ప్రత్యేకంగా రప్పించారు. వారు ఆ ఊర్లో ఉన్నకోతులను వారు పట్టుకెళ్ళి అడవిలో వదిలిపెట్టారు. గెలిచిన తెల్లవారే ఆ హామీని నిలబెట్టుకొని రికార్డు సృష్టించింది. సర్పంచ్ పనితీరుపై గ్రామస్తుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతకీ ఆ ఊరు ఎక్కడంటే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామం. సర్పంచ్ పేరు చింతలపల్లి విజయమ్మ. ప్రతి ఊరిలో కోతులతో పెద్ద సమస్య. ఇన్నీరోజులు గుట్టలు.. ఇతర ప్రాంతాల్లో సంచరించే కోతులు ప్రస్తుతం గ్రామాలు, ఇండ్లలోకే వస్తున్నాయి. గుట్టలు గ్రానైట్ దెబ్బకు కరిగిపోవడంతో కోతులు గ్రామాల బాట పడుతున్నాయి. ఊర్లలో వీటి బెడత తీవ్రమైంది. ఇండ్లలోకి చొచ్చుకెళ్లి వస్తువులను ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. అనేక మంది వాటి చేతిలో గాయపడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే చేతిలో కర్ర లేకుండా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రజలంతా కోతులను చూస్తే వణికిపోతున్నారు. ఇల్లంతకుంట మండలం కందికట్కూరు గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కోతుల సమస్యే ప్రధాన అజెండాగా మారింది. ఎంత అంటే ఆ సమస్యను తీర్చిన వారికే ఓట్లు వేస్తామనే స్థాయికి వెళ్లింది. గ్రామస్తులు అదే నిర్ణయానికి వచ్చారు. కోతుల బాధలు తీర్చిన వారికే ఓటు వేస్తామని తేల్చి చెప్పారు. దీంతో ఎన్నికల్లో సర్పంచ్గా గెలిపిస్తే కోతుల సమస్య మొదట తీరుస్తానని చింతలపల్లి విజయమ్మ మాట ఇచ్చింది గ్రామస్తులకు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో విజయమ్మకు గ్రామస్తులు అండగా నిలిచారు. నమ్మకంతో గెలిపించారు. విజయమ్మ 389 ఓట్ల మెజార్టీతో కందికట్కూర్ గ్రామ సర్పంచ్గా విజయం సాధించారు. ప్రజలకు ఇచ్చిన ఆ హామీని నాన్చకుండా గెలిచిన తెల్లారే కోతుల బెడదను తీర్చారుజ సోమవారం ఆమె తన వాగ్దానాన్ని అమలు చేసి చూపించారు. కోతులను పట్టేవారిని చిత్తూరు నుంచి రప్పించారు. వారు 113 కోతులను సురక్షితంగా పట్టుకుని బోనుల్లో బంధించారు. వాటిని దూరంగా ఉన్న ఒక అడవిలో వదిలిపెట్టారు. కోతుల బెడదను పరిష్కరిస్తానన్న తన వాగ్దానాన్ని నెరవేర్చినందుకు గ్రామస్తులు సర్పంచ్ చింతలపల్లి విజయమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోతులతో రోజూ ఇబ్బందులు పడేవారమనీ, కొత్త సర్పంచ్ వల్ల కోతుల బెడద తప్పిందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో నేతలు విజయం సాధించేందుకు అలవి కానీ హామీలు ఇస్తూ గాలికి వదిలేస్తారు. ఏళ్లు గడిచిన అతీగతి ఉండదు. వాటి ఊసే ఎత్తరు. ఆ సర్పంచ్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన తెల్లారే ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాన్ని నెరవేర్చారు. ఆదర్శంగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రంలోనే కొత్త చరిత్ర సృష్టించారు. హ్యాట్సప్ సర్పంచ్ విజయలక్ష్మి.. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పనులు చేపడుతూ పేరు ప్రఖ్యాతులు సాధించాలని కోరుకుందాం..

## సిపిఎం పార్టీకి మంగ నర్సింహులు



**ఆలేరు, మహా:** సిపిఎం జిల్లా నాయకులు మంగ నర్సింహులు ఆ పార్టీకి మంగళవారం నాడు రాజీనామా చేశారు.. 35 సంవత్సరాలుగా పార్టీలో అనేక భాద్యతలు నిర్వహించిన నర్సింహులు జిల్లా కార్యదర్శి జహంగీర్ గ్రూప్ రాజకీయాల వల్ల విసిగెత్తి పార్టీకి పార్టీ సభ్యత్వాని రాజీనామా చేసి తన రాజీనామా విషయం జిల్లా కార్యదర్శికి సమాచారం ఇచ్చారు.

### ఓటును దుర్వినియోగం

## చేస్తే జైలు శిక్ష...

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి, భువనగిరి, మహా:** ఓటును వినియోగించుకోవాలి కాని దుర్వినియోగం చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. తెలంగాణ పంచాయతి రాజ్ చట్టంలోని రూల్ 227 మరియు ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 1951లోని సెక్షన్ 135 ప్రకారం అట్టి వ్యక్తులపై తీవ్ర మైన చర్యలు 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ సమయంలో కూడా కౌంటింగ్ సిబ్బంది తప్ప ఇతరులు ఎవరు బ్యాలెట్ పేపర్ ని ముట్రాదన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవాలి,కాని బ్యాలెట్ పేపర్ ని చించడం కానీ, బయటకు తీసుకువెళ్లడం లాంటి చర్యలు చేసిన వారిపై పంచాయతి రాజ్ చట్టం లోని రూల్ 227 ప్రకారం జైలు శిక్షకు అర్హులు అవుతారని, కాబట్టి అందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పోలింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**మోటకొండూర్, మహా:** ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి ఓటర్ రెండు ఓట్లు బ్యాలెట్ బాక్సులో వేస్తున్నారా లేదా అని తప్ప కుండా పరిశీలించాలని, ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతి ఎన్నికల్లో భాగంగా మూడవ విడత ఎన్నికలు జరగనున్న మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పోలింగ్ సిబ్బంది అందరూ పోలింగ్ సామగ్రి అయిన బ్యాలెట్ బాక్స్ లు ఓపెన్ అవుతున్నాయా లేదా అని చెక్ చేసుకోవాలి.బ్యాలెట్ పేపర్లుకూడా చెక్ చేసుకోవాలన్నారు అన్ని ఒక్కటి కి రెండు సార్లు చెక్ చేసుకోవాలన్నారు. ఓటర్ లిస్ట్ ఇక్కడే క్షుణ్ణంగా పరిశీలించి తీసుకెళ్లాలని తెలిపారు. . పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే ఈరోజు అన్ని సిద్ధం చేసుకోవాలి అన్నారు. పోలింగ్ కేంద్రం బయట గుర్తులతో పోలీ ఉండే ఫారం9 అతికించాలి. ఓటర్ లు అందరూ రెండు బ్యాలెట్ పేపర్లు బ్యాలెట్ బాక్స్ లో వేస్తున్నారా లేదా క్షుణ్ణంగా పరిశీలించాలి అన్నారు. పోలింగ్ పూర్తి అయినా పోలింగ్ సామగ్రి ని విధిగా రిసెప్షన్ సెంటర్ లో అందజేయాలి అన్నారు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. పోలింగ్ సామాగ్రిని సర్దుకుని బస్సు ఎక్కిన సిబ్బంది దగ్గరికి వెళ్లి పరిశీలించారు

# ఆటగాళ్లపై కాసుల వర్షం

## ఐపీఎల్ మినీ వేలం... అమ్ముడైన, అమ్ముడుపోని ఆటగాళ్ల పూర్తి జాబితా

**మహా :** ఐపీఎల్ 2026 మినీ వేలం అబుదాబిలో అట్టహాసంగా జరిగింది. ఈ వేలంలో పలువురు ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కాసుల వర్షం కురిపించాయి. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అతడిని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఏకంగా రూ. 25.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఈసారి వేలంలో అన్‌క్యాప్డ్ భారత ఆటగాళ్లు సంచలనం సృష్టించారు. ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మ అనే ఇద్దరు యువ ఆటగాళ్లను చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చెరో రూ. 14.20 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. అలాగే శ్రీలంక యంగ్ పేసర్ మతీశ పతిరణను కేకేఆర్ రూ. 18 కోట్లకు కొనుగోలు చేసింది. అత్యధికంగా రూ. 64.30 కోట్ల పర్స్‌తో కేకేఆర్, ఆ తర్వాత రూ. 43.40 కోట్లతో సీఎస్‌కే ఈ వేలంలో పాల్గొన్నాయి. రాబోయే ఐపీఎల్ సీజన్ మార్చి 26 నుంచి మే 31 వరకు జరగనుంది.

**వేలంలో అమ్ముడైన, అమ్ముడుపోని ఆటగాళ్ల పూర్తి జాబితా**

- జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్ అమ్ముడుపోలేదు
- డేవిడ్ మిల్లర్ ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లు
- పృథ్వీ షా ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 75 లక్షలు
- డెవాన్ కాన్వే అమ్ముడుపోలేదు
- కామెరూన్ గ్రీన్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 25.20 కోట్లు
- సర్ఫరాజ్ ఖాన్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 75 లక్షలు
- గస్ అట్కిన్సన్ అమ్ముడుపోలేదు
- రచిన్ రవీంద్ర కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 2 కోట్లు
- లియామ్ లివింగ్‌స్టోన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 13 కోట్లు
- వియాన్ ముల్డర్ అమ్ముడుపోలేదు
- వనిందు హసరంగ లక్నో సూపర్ జెయింట్స్ రూ. 2 కోట్లు
- వెంకటేశ్ అయ్యర్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 7 కోట్లు
- దీపక్ హుడా అమ్ముడుపోలేదు
- కేఎస్ భరత్ అమ్ముడుపోలేదు
- క్వింటన్ డి కాక్ ముంబై ఇండియన్స్ రూ. 1 కోటి
- రహ్మానుల్లా గుర్బాజ్ అమ్ముడుపోలేదు
- జానీ బెయిర్‌స్టో అమ్ముడుపోలేదు
- జామీ స్మిత్ అమ్ముడుపోలేదు
- బెన్ డకెట్ ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లు
- ఫిన్ అలెన్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 2 కోట్లు
- మాట్ హెన్రీ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 2 కోట్లు
- ఆకాశ్ దీప్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 1 కోటి
- జాకబ్ డఫీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 2 కోట్లు
- శివమ్ మావి సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 75 లక్షలు
- గెరాల్డ్ కోయెట్జీ అమ్ముడుపోలేదు
- మతీశ పతిరణ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 18 కోట్లు
- స్పెన్సర్ జాన్సన్ అమ్ముడుపోలేదు
- ఆన్రిచ్ నోర్ట్జే లక్నో సూపర్ జెయింట్స్ రూ. 2 కోట్లు
- ఫజల్హక్ ఫారూఖీ అమ్ముడుపోలేదు
- రాహుల్ చాహర్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 5.20 కోట్లు
- రవి బిష్ణోయ్ రాజస్థాన్ రాయల్స్ రూ. 7.20 కోట్లు
- మహీశ్ తీక్షణ అమ్ముడుపోలేదు
- ముజీబ్ ఉర్ రెహమాన్ అమ్ముడుపోలేదు
- అకీల్ హోసేన్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 2 కోట్లు
- అథర్వ తైడే అమ్ముడుపోలేదు
- అన్మోల్‌ప్రీత్ సింగ్ అమ్ముడుపోలేదు
- అభినవ్ తేజ్రానా అమ్ముడుపోలేదు
- అభినవ్ మనోహర్ అమ్ముడుపోలేదు
- యశ్ ధుల్ అమ్ముడుపోలేదు
- ఆర్య దేశాయ్ అమ్ముడుపోలేదు
- ఆకిబ్ దార్ ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 8.40 కోట్లు
- విజయ్ శంకర్ అమ్ముడుపోలేదు
- రాజ్‌వర్ధన్ హంగర్గేకర్ అమ్ముడుపోలేదు
- మహిపాల్ లోమ్రోర్ అమ్ముడుపోలేదు
- ఈడెన్ యాపిల్ టామ్ అమ్ముడుపోలేదు
- ప్రశాంత్ వీర్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 14.20 కోట్లు
- శివాంగ్ కుమార్ సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 30 లక్షలు
- తనుష్ కోటియన్ అమ్ముడుపోలేదు
- కమలేశ్ నాగర్‌కోటి అమ్ముడుపోలేదు
- సన్వీర్ సింగ్ అమ్ముడుపోలేదు
- రౌచిత్ అహిర్ అమ్ముడుపోలేదు
- కార్తీక్ శర్మ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 14.20 కోట్లు
- ముకుల్ చౌదరి లక్నో సూపర్ జెయింట్స్ రూ. 2.60 కోట్లు
- తేజస్వి సింగ్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 3 కోట్లు
- వంశ్ బేడీ అమ్ముడుపోలేదు
- తుషార్ రహేజా అమ్ముడుపోలేదు




- అశోక్ శర్మ గుజరాత్ టైటాన్స్ రూ. 90 లక్షలు
- రాజ్ లింబానీ అమ్ముడుపోలేదు
- కార్తీక్ త్యాగి కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 30 లక్షలు
- సిమర్‌జీత్ సింగ్ అమ్ముడుపోలేదు
- ఆర్య దేశాయ్ అమ్ముడుపోలేదు
- నమన్ తివారీ లక్నో సూపర్ జెయింట్స్ రూ. 1 కోటి
- ఆకాశ్ మధ్వాల్ అమ్ముడుపోలేదు
- సుశాంత్ మిశ్రా రాజస్థాన్ రాయల్స్ రూ. 90 లక్షలు
- వహీదుల్లా జద్రాన్ అమ్ముడుపోలేదు
- శివమ్ శుక్లా అమ్ముడుపోలేదు
- యశ్‌రాజ్ పుంజా రాజస్థాన్ రాయల్స్ రూ. 30 లక్షలు
- ప్రశాంత్ సోలంకి కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 30 లక్షలు
- విఘ్నేష్ పుత్తూర్ రాజస్థాన్ రాయల్స్ రూ. 30 లక్షలు
- కర్ణ్ శర్మ అమ్ముడుపోలేదు
- కుమార్ కార్తికేయ సింగ్ అమ్ముడుపోలేదు
- సెదికుల్లా అటల్ అమ్ముడుపోలేదు
- పతుమ్ నిస్సంక ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 4 కోట్లు
- రాహుల్ త్రిపాఠి కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 75 లక్షలు
- సీన్ అబాట్ అమ్ముడుపోలేదు
- మైఖేల్ బ్రేస్‌వెల్ అమ్ముడుపోలేదు
- బెన్ ద్వార్షుయిస్ పంజాబ్ కింగ్స్ రూ. 4.40 కోట్లు
- జాసన్ హోల్డర్ గుజరాత్ టైటాన్స్ రూ. 7 కోట్లు
- దసున్ శనక అమ్ముడుపోలేదు
- డారిల్ మిచెల్ అమ్ముడుపోలేదు
- మాథ్యూ షార్ట్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 1.50 కోట్లు
- టామ్ బాంటన్ గుజరాత్ టైటాన్స్ రూ. 2 కోట్లు
- జోర్డాన్ కాక్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 75 లక్షలు
- జోష్ ఇంగ్లిస్ లక్నో సూపర్ జెయింట్స్ రూ. 8.60 కోట్లు
- టిమ్ సీఫెర్ట్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 1.50 కోట్లు
- కైల్ జేమీసన్ ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లు
- ఆడమ్ మిల్నే రాజస్థాన్ రాయల్స్ రూ. 2.40 కోట్లు
- లుంగి ఎంగిడి ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లు
- ముస్తాఫిజుర్ రెహమాన్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 9.2 కోట్లు
- చేతన్ సకారియా అమ్ముడుపోలేదు
- కుల్దీప్ సేన్ రాజస్థాన్ రాయల్స్ రూ. 75 లక్షలు
- వకార్ సలామ్‌ఖైల్ అమ్ముడుపోలేదు
- దనీష్ మలేవార్ ముంబై ఇండియన్స్ రూ. 30 లక్షలు
- సల్మాన్ నిజార్ అమ్ముడుపోలేదు
- అక్షత్ రఘువంశీ లక్నో సూపర్ జెయింట్స్ రూ. 2.2 కోట్లు
- సాత్విక్ దేస్వాక్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 30 లక్షలు
- అమన్ ఖాన్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 40 లక్షలు
- విక్కీ ఓస్త్వాల్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 30 లక్షలు
- మయాంక్ రావత్ ముంబై ఇండియన్స్ రూ. 30 లక్షలు
- మంగేష్ యాదవ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 5.20 కోట్లు
- సలిల్ అరోరా సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 1.40 కోట్లు
- రవి సింగ్ రాజస్థాన్ రాయల్స్ రూ. 95 లక్షలు
- కేఎం ఆసిఫ్ అమ్ముడుపోలేదు
- సాకిబ్ హుస్సేన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 30 లక్షలు
- మహ్మద్ ఇజార్ ముంబై ఇండియన్స్ రూ. 30 లక్షలు
- ఓంకార్ తర్మలే సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 30 లక్షలు
- మురుగన్ అశ్విన్ అమ్ముడుపోలేదు
- తేజస్ బరోకే అమ్ముడుపోలేదు
- కేసీ కరియప్ప అమ్ముడుపోలేదు
- మోహిత్ రాఠీ అమ్ముడుపోలేదు
- కూపర్ కనోలీ పంజాబ్ కింగ్స్ రూ. 3 కోట్లు
- డాన్ లారెన్స్ అమ్ముడుపోలేదు
- తస్కిన్ అహ్మద్ అమ్ముడుపోలేదు
- రిచర్డ్ గ్లీసన్ అమ్ముడుపోలేదు
- అల్జారీ జోసెఫ్ అమ్ముడుపోలేదు
- రిలే మెరెడిత్ అమ్ముడుపోలేదు
- జై రిచర్డ్‌సన్ అమ్ముడుపోలేదు
- ధీరజ్ కుమార్ అమ్ముడుపోలేదు
- తనయ్ త్యాగరాజన్ అమ్ముడుపోలేదు
- కానర్ ఈ. అమ్ముడుపోలేదు
- ఇర్ఫాన్ ఉమైర్ అమ్ముడుపోలేదు
- చింతల్ గాంధీ అమ్ముడుపోలేదు
- అమిత్ కుమార్ సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 30 లక్షలు
- విశాల్ నిషాద్ పంజాబ్ కింగ్స్ రూ. 30 లక్షలు
- నాథన్ స్మిత్ అమ్ముడుపోలేదు
- డేనియల్ లేట్‌గాన్ అమ్ముడుపోలేదు
- అథర్వ అంకోలేకర్ ముంబై ఇండియన్స్ రూ. 30 లక్షలు
- కరణ్ లాల్ అమ్ముడుపోలేదు
- ఉత్కర్ష్ సింగ్ అమ్ముడుపోలేదు
- ఆయుష్ వర్తక్ అమ్ముడుపోలేదు
- ఆయుష్ హింగే సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 30 లక్షలు
- జిక్కు బ్రైట్ అమ్ముడుపోలేదు
- ఇజాజ్ సవారియా అమ్ముడుపోలేదు
- క్రెయిన్స్ ఫులెత్రా సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 30 లక్షలు
- సార్థక్ రంజన్ కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 30 లక్షలు
- దక్ష్ కమ్రా కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 30 లక్షలు
- మణిశంకర్ మురసింగ్ అమ్ముడుపోలేదు
- అమన్ రావ్ రాజస్థాన్ రాయల్స్ రూ. 30 లక్షలు
- మనన్ వోహ్రా అమ్ముడుపోలేదు
- ప్రవీణ్ దూబే పంజాబ్ కింగ్స్ రూ. 30 లక్షలు
- సాహిల్ పరాఖ్ ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 30 లక్షలు
- మయాంక్ దాగర్ అమ్ముడుపోలేదు
- మనీ గ్రేవాల్ అమ్ముడుపోలేదు
- మాక్‌నీల్ నొరోన్హా అమ్ముడుపోలేదు
- సిద్ధార్థ్ యాదవ్ అమ్ముడుపోలేదు
- బ్రిజేష్ శర్మ రాజస్థాన్ రాయల్స్ రూ. 30 లక్షలు
- రితిక్ టాడా అమ్ముడుపోలేదు
- జాక్ ఎడ్వర్డ్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 3 కోట్లు
- చామా మిలింద్ అమ్ముడుపోలేదు
- స్వాతిక్ చికారా అమ్ముడుపోలేదు
- జకరీ ఫౌక్స్ చెన్నై సూపర్ కింగ్స్ రూ. 75 లక్షలు
- పృథ్వీ రాజ్ గుజరాత్ టైటాన్స్ రూ. 30 లక్షలు
- విలియం సదర్లాండ్ అమ్ముడుపోలేదు
- ల్యూక్ వుడ్ గుజరాత్ టైటాన్స్ రూ. 75 లక్షలు
- ఆర్‌ఎస్ అంబరీష్ అమ్ముడుపోలేదు
- విహాన్ మల్హోత్రా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 30 లక్షలు
- కనిష్ చౌహాన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 30 లక్షలు

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

mahaapatrika@gmail.com

whatsapp: 74369 39999

# మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్ ల ఆగడాలు శృతి మించి పోతున్నాయి. గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్ లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్ లను ఉమ్మడి ఆంధ్రప్రదేశలో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజు కున్న మైక్రో ఫైనాన్సలు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీ వారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్ ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘాటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాల లో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళ లు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్ లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్ ల ఆగడాలను ప్రారంభంలోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగా ఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తాము భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్సలు విజృంభిస్తున్నా యి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్ ల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10 మందితో సంఘాలు ఏర్పాటు చేయించి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారం వారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రో రుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోనలు కూడా ఇస్తున్నారు. దీంతో పలువురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీ



కరిస్తూ చెల్లించలేక చతికిలపడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్ లో అందుబాటులో ఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణ గ్రహీతలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణ చెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. నేడు కూడా అలాంటి దుర్ఘాటనలు పునరావృత్తమయ్యే ప్రమాదాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రో రుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది.రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా డివిజన్ మండల కేంద్రాల్లో వేలాది మైక్రోఫైనాన్స్ లు వున్నాయి. అన్నీ చెన్నై రాష్ట్రంలో నుండే కార్య కలాపాలు నిర్వహిస్తూ ఉన్నాయి. రూ.30 వేల నుంచి రూ.2లక్షల వరకు ఇస్తున్న రుణాలను 48 వారాల్లో సమ వాయిదాలతో చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క వాయిదా చెల్లింపులో ఆలస్యం జరిగినా భారీ జరిమానాతో వసూళ్లు చేస్తున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించని రుణ గ్రహీతల పరువును బజారులో నిలదీస్తున్నారు. దీంతో వాయిదాల చెల్లింపునకు కూడా పలువురు మహిళలు అధిక వడ్డీతో అప్పులు చేస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో మైక్రో ఫైనాన్స్ లను నిషేధించాలంటూ మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో పలు పేద కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే ప్రమాదాలు ఉన్నాయి. అవగాహన రాహిత్యం, ఆర్థిక అవసరాల కోసం అధికవడ్డీతో రుణాలు తీసుకుంటున్న పలువురు మహిళలు వాయిదాలు చెల్లించలేక మొహం చాటేస్తున్న పరిస్థితి ఉంది స్తోమతకు మించి రుణాలు మంజూరు జరుగుతుండడంతో తిరిగి చెల్లించలేక ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలోనే గత దుర్ఘటనలు పునరావృత్తమయ్యే ప్రమాదం ఉంది. మైక్రో ఫైనాన్స్ ల రుణాలతో సమభావన, స్త్రీ నిధి రుణాలను పలువురు మహిళలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. మైక్రో రుణ వాయిదా ప్రతీవారం చెల్లించాల్సి ఉండడంతో బ్యాంకు లింకేజీ రుణాలను మహిళలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. వారం వాయిదా చెల్లింపులో ఏ మాత్రం ఆలస్యం జరిగినా మైక్రో ఫైనాన్స ఏజెంట్లు సంబంధిత మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం మైక్రో ఫైనాన్సలపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరుగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.ప్రభుత్వాలు వీని మీద ఆంక్షలు విధించాలి

**- కామిడి సతీష్ రెడ్డి,**
జయశంకర్ భూపాల పల్లి జిల్లా
9848445134

# 20 వేల కోట్ల ఐడీపీఎల్ భూముల స్వాధీనానికి సర్కారు రెడీ




తెలంగాణలో ఐడీపీఎల్ భూములపై వివాదం కొనసాగుతున్న వేళ, ఇందులో రూ.20వేల కోట్ల కుంభకోణం కబ్జాకోణం ఉందన్న ఆరోపణలున్నాయి. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట కవిత ఇద్దరు ఈ అంశంలో పరస్పర ఆరోపణలు చేసుకోగా, దీనిపై రాష్ట్ర సర్కారు రంగంలోకి దిగింది. ఐడీపీఎల్‌కు.. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలు విలువ చేసే వందల ఎకరాల భూములను కబ్జా చేశారని.. ఇదేమని ప్రశ్నిస్తే.. బెదిరిస్తున్నారంటూ ఆరోపణలు వస్తోన్నాయి. ఈక్రమంలో తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. సుమారు 20 వేల కోట్ల రూపాయల విలువైన ఐడీపీఎల్ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు రెడీ అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం బాలానగర్‌లో ఉన్న ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కు చెందిన సుమారు రూ. 20,000 కోట్ల విలువైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఇందుకుగాను.. కేంద్ర ప్రభుత్వంపై చట్టపరమైన చర్యలు మళ్లీ ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది. ఈక్రమంలో ప్రభుత్వం.. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) కి తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఐడీపీఎల్‌కు చెందిన 891 ఎకరాల భూమిని తిరిగి తీసుకోవడానికి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలని.. అలాగే బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ (బీఐఎఫ్ఆర్) నుండి అవసరమైన ఉత్తర్వులు పొందాలని.. టీజీఐఐసీకి ప్రభుత్వం సూచించింది. వేల కోట్ల రూపాయల విలువైన భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలు పెరిగిపోతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. ఈ భూమిని వేలం వేసి వనరులు సమకూర్చుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అయితే వాటి ఉద్దేశాలు వేరుగా ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న తర్వాత.. ఆర్థిక వనరులను పెంచుకునేందుకు.. ఈ భూములను వేలం వేయాలని యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఐడీపీఎల్ అప్పులను తీర్చడానికి, దాని మాజీ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ఈ భూమిని వేలం వేయాలని భావిస్తోంది. ఈ సమస్య ఎన్నో ఏళ్ల క్రితం మొదలైంది. 2003లో డ్రగ్ తయారీ యూనిట్ మూతపడింది. అప్పటినుండి కార్యకలాపాలు నిలిచిపోయాయని పేర్కొంటూ, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని అప్పటి అధికారులు కేంద్రాన్ని కోరారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం.. ఈ భూమిని దశాబ్దాల క్రితం రాష్ట్ర ప్రభుత్వమే సేకరించి, ప్రజల ప్రయోజనం కోసం ఐడీపీఎల్‌కు అప్పగించింది కనుక తిరిగి స్వాధీనం చేసుకోవాలని భావిస్తోంది. అప్పట్లో ఐడీపీఎల్‌ను నష్టాల్లో నడుస్తున్న సంస్థగా ప్రకటించడంతో, బీఐఎఫ్ఆర్.. కలెక్టర్ ఆదేశాలపై స్టే విధించింది. చట్టపరమైన ప్రక్రియలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపింది. అలానే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. అయితే ఈ అంశంపై ప్రభుత్వం న్యాయ సలహా కోరింది. తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి బీఐఎఫ్ఆర్ ఆదేశాలను హైకోర్టులో సవాలు చేయాలని సూచించారు.

**ఆక్రమణలపై నజర్**

ఐడీపీఎల్ 2003లో మూతపడింది. అప్పటి నుంచి ఈ భూమి నిరుపయోగంగా పడి ఉంది. గత కొంతకాలంగా.. ఈభూమిలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, భూమిని కాపాడి దానిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం ముందడుగు వేసింది. దీనిలో భాగంగానే.. టీజీఐఐసీ ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ ప్రక్రియలో బీఐఎఫ్ఆర్ నుండి అనుమతి పొందడం కూడా కీలకం కానుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో దీనిపై వేగంగా పావులు కదుపుతోంది.

## పీహెచ్‌డీ విద్యార్థుల స్టైపెండ్ విడుదలలో ప్రభుత్వానికి ఎందుకు ఇంత నిర్లక్ష్యం

**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆందోళనలు నిరసనలు**



**రాజేంద్రనగర్, మహా ;** పీహెచ్డీ విద్యార్థుల స్టైపెండ్ విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వైస్తుందంటూ. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు మంగళవారం ఆందోళనలు నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయానికి వెన్నెముకగా నిలుస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేడు విద్యార్థులు ఆగ్రహంతో ఊగిపోయారు. పెంచిన పీజీ, పీహెచ్డీ స్కాలర్ స్టైపెండ్లను తక్షణమే విడుదల చేయాలంటూ పీజీ పీహెచ్డీ రీసెర్చ్ స్కాలర్లు యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసనలతో ఆందోళనకు దిగారు. గత కొన్నేళ్లుగా పెరిగిన జీవన వ్యయాలు, పరిశోధన ఖర్చులు, సెమిస్టర్ ఫీజుల భారం భరిస్తూ అల్లాడుతున్న విద్యార్థులు, స్టైపెండ్ పెంపు కోసం ప్రభుత్వానికి, వర్సిటీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఖాతాల్లో జమ కాకపోవడం విద్యార్థుల ఆగ్రహానికి కారణమైందన్నారు. ఉపకులపతి డా, అల్దాస్ జానయ్య బాధ్యతలు చేపట్టి పీజీ, పీహెచ్డీ విద్యార్థుల స్టైపెండ్‌ను పెంచుతూ విశ్వవిద్యాలయం అధికారిక సర్క్యులర్ జారీ చేశారు. ఈ పెరిగిన స్టైపెండ్‌ను యూనివర్సిటీ బడ్జెట్ నుంచే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం అని. ప్రభుత్వం జోక్యం చేసుకొని నిధుల విడుదలను అడ్డుకోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. స్టైపెండ్ విడుదల కాకపోవడంతో సెమిస్టర్ ఫీజులు కట్టలేక, ప్రయోగాలు చేయలేక, ఫీల్డ్ వర్క్, రీసెర్చ్ ట్రయల్స్ కి ఆటంకం కలుగుతుందన్నారు. కుటుంబాలపై ఆర్థిక భారం మోపాల్సిన పరిస్థితి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులకు సేవలందిస్తూ, కొత్త విత్తన రకాల అభివృద్ధి, పరిశోధనలు, ఎక్స్‌టెన్షన్ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న పీజీ, పీహెచ్డీ స్కాలర్లు లేకపోతే వ్యవసాయ విశ్వవిద్యాలయాలే, లేవు అని విద్యార్థులు స్పష్టం చేశారు. ఒకవైపు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేసే ప్రభుత్వం, ఇదే రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని ముందుండి నడిపిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల విషయంలో మాత్రం చిన్నచూపు చూపడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రానికి అన్నం పెట్టే రైతుకు మేము జ్ఞానం అందిస్తున్నాం. మమ్మల్ని మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు మంత్రులను అధికారులను కలిసినా స్పందన లేకపోవడంతోనే నిరసనలకు దిగాల్సి వచ్చిందని విద్యార్థులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపి, యూనివర్సిటీ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే అమలు చేస్తూ, పెరిగిన పీజీ, పీహెచ్డీ స్టైపెండ్లను తక్షణమే విడుదల చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు డిమాండ్ చేశారు.

## ఆరు దశాబ్దాల ఏకగ్రీవ రికార్డు కు బ్రేక్

- బరంపూర్ లో సర్పంచ్ కు ఎన్నికలు
- పోటీలో ఇద్దరు అభ్యర్థులు
- ప్రత్యక్ష ఓట్ వేయనున్న ఓటర్లు




**ఆదిలాబాద్, మహా :** పల్లె పోరు అంటే గట్టి పోటీకి తార్కాణం. గ్రామపంచాయతీ ఎన్నికలలో పార్టీతో సంబంధం లేకుండా వ్యక్తిగత ఇమేజ్ తో పోటీకి సై అంటుంటారు.చిన్న పల్లె అయినా పోటీకి తాము సిద్ధమంటూ సర్పంచ్ బరిలో నిలబడతారు. ఒక్కోచోట ఈ సంఖ్య కాస్తా ఎక్కువే ఉంటుంది. కాని దాదాపు ఆరు దశాబ్దాలుగా ఆ గ్రామ పంచాయతీ ఓటర్లు సర్పంచ్ ఎన్నికలకు ఓటు వేయలేదు. ఎందుకంటే అనాదిగా ఆ గ్రామం రికార్డు స్థాయిలో ఏకగ్రీవమవుతూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది.గ్రామం అంతా ఒక్కటై ప్రతీ ఎన్నికల్లో కూర్చుని మాట్లాడుకుని ఒకరిని సర్పంచ్ గా ఏకగ్రీవం చేస్తారు.ఇలా 61 ఏళ్లపాటు ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నికే జరగలేదు. కాని ఈ సారి మాత్రం ఆ రికార్డ్ బ్రేకైంది. ఇంతకీ ఆగ్రామం ఏంటో తెలుసుకుందామా... ఆదిలాబాద్ జిల్లా బోథ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడిన 1964 నుండి గత ఎన్నికల వరకు ప్రజా ఓటింగ్ లేదు. అప్పటి నుండి మొన్నటివరకు ఆనవాయితీగా గ్రామ పెద్దలు సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తూ వచ్చారు.ఏకగ్రీవం సందర్భంగా వచ్చిన ప్రోత్సాహక నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఇలా అప్రతిహతంగా 60 ఏళ్లుగా గ్రామంలోని ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో ఓటు వేసింది లేదు. కానీ ఈ సారి మాత్రం అరవై ఏళ్ల రికార్డుకు బ్రేక్ పడుతోంది. రొటేషన్ పద్ధతిలో ఆ గ్రామ పంచాయతీ ఈ దఫా ఎస్టీలకు రిజర్వయింది. అయితే ఏకగ్రీవ ఆనవాయితీ కొనసాగించాలకున్న బరంపూర్ గ్రామ పెద్దల ప్రయత్నం ఈసారి ఫలించలేదు. రాజకీయ పార్టీల మద్దతుతో పోటీ అనివార్యమైంది. దీంతో అరవైయేళ్ల రికార్డు ఏకగ్రీవ ఎన్నికకు కాస్తా ఫుల్ స్టాప్ పడింది.

**సర్వత్రా ఆసక్తి**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల మూడో విడతలో భాగంగా ఇక్కడ ఎన్నిక జరుగుతోంది.దీని పంచాయతీ పరిధిలో మొత్తం పది వార్డులు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలో 2556 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో ఏకగ్రీవమైన కొన్ని గ్రామ పంచాయితీల జాబితాలో బరంపూర్ గ్రామం కూడా చేరుతుందని అందరూ భావించారు. కాని ఈ సారి సీన్ రివర్స్ అయింది. నామినేషన్ ల ఉపసంహరణ అనంతరం కాంగ్రెస్ మద్దతు తో లక్ష్మణ్ బీ ఆర్ ఎస్ మద్దతు తో దేవరావు పోటీలో నిలవడంతో బుధవారం ఎన్నిక జరగనుంది. మొత్తానికి అరవై ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యయుతంగా ఎన్నిక జరిగి సర్పంచ్ ఎన్నిక కానున్నారు.



## మానవత్వాన్ని చాటిన అధికారులు

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మెహిదీపట్నం వెళ్లే రహదారిలో మానసిక వికలాంగుడైన వృద్ధుని గుర్తించారు. ఎముకలు కొరికే చలిలో పడుకోన్ని మల్ల మూత విసర్జన అక్కడే చేసుకుంటూ ఇబ్బంది పడుతున్న వృద్ధుని రాజేంద్రనగర్ సర్కిల్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, ట్రాఫిక్ సీఐ రాజు తన సిబ్బంది, స్థానికులతో కలిసి మానసిక శారీరకంగా దూడంగా ఉండడానికి ఆహారంతో పాటు వైద్యల సంరక్షణలో ఉంచాలని షెల్టర్ రూమ్ కు తరలించారు.



## నిర్భయంగా ఓటు వేయండి

**ఎసిపి కెపీవి రాజు**

**ఆమనగల్లు, మహా :** స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని ఇబ్రహీంపట్నం ఎసిపి కేపీవి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం మాడ్గుల పోలీస్ స్టేషన్ ను సందర్శించి,సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎస్‌హెచ్ఓ మాడ్గుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో 265 మంది పోలీస్ బలగం, 13 రూట్ మొబైల్ వాహనాలు, ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికలపై నిరం తర పర్యవేక్షణ ఉండాలన్నారు.ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీ సులు నిరంతరం నిఘా పెంచి శాంతిభద్ర తలను విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసు కోవాలని, గ్రామాల్లో బెల్టుషాపుల పై దాడులు చేసి మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటరు కార్డు, ఆధార్‌కార్డు ఉన్న వారిని మాత్రమే అను మతించాలని తెలిపారు.

## పొరపాట్లు జరగకుండా ఎన్నికలు నిర్వహించాలి

**అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేడు జరిగే మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్న పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మంచాల మండలంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని సరిగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలుదేరాలని సూచించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, సంబంధిత తహసీల్దార్లు, ఎంపిడిఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఈనెల 19న వాహనాల వేలం

**ఆమనగల్లు, మహా:** ఈ నెల 19వ ఉ.10:30 గంటలకు ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు నేరాల్లో పట్టుబడిన వివిధ కేసులలో పట్టుబడిన వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆసక్తి గలవారు ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం పాటలో ఉదయం 10:30 గంటల వరకు పాల్గొనాలని సూచించారు.4 మండలాల్లో కేసులలో పట్టుబడిన వాహనాల వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉపాధి హామి ఉసురు తీసేందుకు కేంద్రం కుట్ర

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్**



**మొయినాబాద్ మహా :** మహాత్మగాంధీ గ్రామీణ ఉపాది హామీ చట్టాన్ని చంపే కుట్రకు కేంద్రం తెరలేపిందని.. ఆ చట్టం పేరునే కాకుండా అమలు విదానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇది గుంతలు తవ్వే పథకమని బీజేపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రదాని మోడీ ఎద్దేవా చేశారని.. దీన్ని రద్దు చేయాలన్నదే మొదటి నుంచీ ఆయన ఆకాంక్ష అని ఆరోపించారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే మహోన్నత నాయకుడు మహాత్మగాంధీ. ఆయన పేరును ఎందుకు తొలగించాలని అనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి నుంచి మోడీకి ఈ పథకం ఇష్టం లేదని ఆరోపించారు. అందుకే దశల వారిగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపాడాని అన్నారు. దేశంలోని గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉ పాది హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఆజీ)ను రద్దు చేసి దాని స్థానంలో వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీ వికా మిషన్(గ్రామీణ్) బిల్లు, 2025(వీబీజీఆర్ఎఎంజీ బిల్లు) తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాది హామిని వంద రోజుల నుంచి 125 రోజులకు పెంచుతున్నామని ప్రభుత్వం చెప్తున్నా అతి పేరుకే పరిమితమన్నారు. జాబ్ కార్డుల రేషనలైజేషన్ పేరిట పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటంబాలను పథకం నుంచి తప్పించే ప్రమాదం ఉన్నదని సూచించారు. ఉపాది హామీ చట్టాన్ని అలాగే కొనసాగించాలనీ దాన్ని స్కీంగా మార్చడాన్ని సహించేది లేదని తెల్చిచెప్పారు. కేంద్రం కొత్తపేరుతో తెచ్చిన ఈ స్కీంలో రాష్ట్రాలపై అదనపు భారాలు వేసేలా నిబందనల్ని రూపొందించారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం మహాత్మగాంధీ గ్రామీణ ఉపాది హామీ చట్టాన్ని చంపే కుట్రకు తెరలేపిందని విమర్శించారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ఏఎస్ రావు 35వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ మొదటి లెవెల్ పరీక్షలో జయ ప్రభంజనం

**సూర్యాపేట జిల్లా మహా:** ఐఐటి ఫౌండేషన్ కు కొలమానంగా పరిగణించబడుతున్న ఏఎస్ రావు అవార్డు కౌన్సిల్ వారు నిర్వహించిన 35వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ మొదటి లెవెల్ లో మంగళవారం జయ ఓలంపైడ్ స్కూల్ విద్యార్థులు తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా1,1,2,6,6,8,10,10 ర్యాంకులు సాధించడంతో రెండు రాష్ట్రాల్లో సెలెక్ట్ అయిన 248 మంది విద్యార్థుల్లో 110 మంది జయ స్కూల్ నుంచి సెలెక్ట్ కావడం ఆనందంగా ఉందని కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్హత సాధించిన విద్యార్థులను కృషిచేసిన ఉపాధ్యాయులను జయ వేణుగోపాల్ డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు. పదవ తరగతి నుండి స్టేట్ ఒకటవ ర్యాంక్ డి రిత్విక, వి వైష్ణవి, స్టేట్ ఆరోవ ర్యాంక్ బి హేమంత్, స్టేట్ పదవ ర్యాంక్ కె దేవి ప్రియ, 9వ తరగతి నుండి స్టేట్ రెండవ ర్యాంక్ వై వీక్షణ, స్టేట్ ఆరోవ ర్యాంక్ డి సాయిచరణ్, స్టేట్ 9వ ర్యాంక్ వి జయ సూర్య, స్టేట్ పదవ ర్యాంక్ ఎస్ శ్రీనిధి సాధించారు. తమ విద్యార్థులు భవిష్యత్తులో ప్రతిష్టాత్మక ఐఐటీలో ప్రవేశాలు సాధించగలరని తెలిపారు. తమపై విశ్వాసాన్ని ఉంచి అన్ని విధాల సహకరిస్తున్న తల్లిదండ్రులకు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## శంషాబాద్ ను జోన్ గా ఏర్పాటు చేయాలి

**రాజకీయ జేఏసీ, కుల సంఘాల నిరసనలు**

**రాజేంద్రనగర్, మహా ;** హైదరాబాద్ మహానగరంలోని జిహెచ్ఎంసి డివిజన్లో పునర్వ్యవస్థీకరణలో భాగంగా శంషాబాద్ ను జోన్ గా ఏర్పాటు చేయాలి. డివిజన్ ల సంఖ్య పెంచాలంటు రాజకీయ జేఏసీ కోన్నెమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహాన్ని కి వినతి పత్రం అందజేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని జిహెచ్ఎంసి పాలకవర్గంలోని ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు శంషాబాద్ అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన విమానాశ్రయంఉంది. కావున డివిజన్లో పునర్వ్యవస్థీకరణలో భాగంగా శంషాబాద్ను జోన్‌గా ప్రకటించి డివిజన్ల సంఖ్య పెంచాలని రాజకీయ జేఏసీ కుల సంఘాలు పలు పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు నిర్వహించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం బీఎస్పీ, రాజకీయ పార్టీల మత్తుతోపాటు ఎమ్మార్పీఎస్ కుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో శంషాబాద్ ను జోన్ గా మార్చి డివిజన్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కోన్నెమొల్ల శ్రీనివాస్, మోహన్ రావు, పరంధాములు, వెంకట్ రెడ్డి, జయసింహా, రమేష్,రమేష్ రాథోడ్, చరణ్, హనుమంతు, శేఖర్, నరేందర్, యాదయ్య, విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఎన్ ఎస్ యు ఐ, బి ఆర్ ఎస్ వి, పలు సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు.

## కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్‌లో విద్యార్థుల ప్రతిభకు వేదికగా ఐడియా ఎక్స్‌పో



**మొయినాబాద్ మహా:** కేఎల్ హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్‌లో ఫ్రెష్మన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ (DTI) బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐడియా ఎక్స్‌పో 2025 ఘనంగా నిర్వహించింది. ఈ ఎక్స్‌పో Y25 బ్యాచ్‌కు చెందిన తొలి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, ఫంక్షనల్ ప్రోటోటైప్స్‌ను ప్రదర్శించేందుకు ఒక చురుకైన వేదికగా నిలిచింది. ఆవిష్కరణ ఆధారిత విద్య, సృజనాత్మకత, అనుభవాత్మక అభ్యాసంపై ఈ ఎక్స్‌పో ప్రధానంగా దృష్టి సారించింది. ఐడియా ఎక్స్‌పో 2025లో వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, కృత్రిమ మేధ (AI), సమాచార సాంకేతికత, సామాజిక ఆవిష్కరణ వంటి విభిన్న రంగాలకు చెందిన విద్యార్థుల ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. ఈ ప్రదర్శనలు విభాగాల మధ్య సమన్వయం, సాంకేతిక నైపుణ్యం, ఆచరణలో ఉపయోగపడే సామర్థ్యాన్ని ప్రతిబింబించాయి. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని అర్థవంతమైన ఆవిష్కరణలుగా మార్చగల విద్యార్థుల సామర్థ్యాన్ని ఇవి స్పష్టంగా చూపించాయి. ప్రముఖ అకాడమిషియన్లు మరియు పరిశ్రమ నిపుణులు ఈ ఎక్స్‌పోకు హాజరుకావడం ద్వారా కార్యక్రమానికి మరింత వైభవాన్ని జోడించారు. ఏకలవ్య ఫౌండేషన్ వైస్ చైర్మన్ శ్రీ మిహిర్ కుమార్ పరియాల్, సిఎస్ఐఆర్ మరియు ఐఐసిటి సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. పి. శ్రీనివాసులు, ఐఐటి హైదరాబాద్ ప్రొఫెసర్ డా. పి. సుదర్శనం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులను అంతర్గత మరియు బాహ్య జ్యూరీ సభ్యులు —— సీనియర్ అధ్యాపకులు, రంగ నిపుణులు —— మూల్యాంకనం చేసి విలువైన సూచనలు, మార్గనిర్దేశనం అందించారు. విద్యార్థుల ఆలోచనల ఒరిజినాలిటీ, ఆవిష్కరణ లోతు, వాస్తవ ప్రపంచానికి అన్వయించుకునే సామర్థ్యాన్ని జ్యూరీ ప్రశంసించింది కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఎర్. కోనేరు లక్ష్మణ్ హవీష్* తన సందేశంలో, ఇంజినీరింగ్ విద్య తొలి సంవత్సరం నుంచే ఆవిష్కర్తలను తీర్చిదిద్దాలన్న సంస్థ దృష్టిని ప్రస్తావించారు. ఐడియా ఎక్స్‌పో వంటి వేదికలు విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో సమస్యలను పరిష్కరించే వారిగా, సృజనకర్తలుగా, భవిష్యత్ ఔత్సాహిక పరిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆలోచనలను ప్రోత్సహించి, మార్గనిర్దేశనం చేసి, ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపే పరిష్కారాలుగా మార్చే అనుకూల వాతావరణాన్ని అందించేందుకు కే ఎల్ హెచ్ కట్టుబడి ఉందని తెలిపారు. ఐడియా ఎక్స్‌పో 2025 విజయవంతంగా నిర్వహించబడేందుకు మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్ డా. ఏ. రామకృష్ణ, ఆర్&డి విభాగం, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ (ED) సెల్, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థి వాలంటీర్ల సమిష్టి సహకారం అందించింది. ఈ కార్యక్రమం క్యాంపస్‌లో ఉత్సాహభరితమైన అకాడమిక్ మరియు ఆవిష్కరణ వాతావరణాన్ని సృష్టించి, యువ మేధలను ప్రోత్సహించింది. భవిష్యత్తుకు సిద్ధమైన ఇంజినీర్లు, ఆవిష్కరణ నాయకులను తయారు చేయడంలో కేఎల్ హెచ్ యొక్క నిబద్ధతను మరోసారి స్పష్టం చేసింది.



## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల కేంద్రం నందు పాస్టర్ విజయలక్ష్మి ఆంథోనీ ఆధ్వర్యంలో వారి చర్చి నందు ఘనంగా సెమీ క్రిస్మస్ నిర్వహించి కేక్ కట్ చేసి స్విట్స్ పంపిణీ చేశారు అనంతరం కీ.శే.రెంటాల ఆంథోని 3 వ జ్ఞాపకార్థం నిర్వహించి ప్రేమ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్,సువార్త చర్చ్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రల కో ఆర్డినేటర్ పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్, బిషప్ ముల్లంగి జాకబ్ రాజు పాల్గొని క్రీస్తు పుట్టిక గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట గౌరవ సలహాదారులు రెవ. బొక్క ఏలీయా రాజు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్,పెన్ పహాడ్ అధ్యక్షులు రెవ. డా. డి.జాన్ ప్రకాష్, సూర్యాపేట రూరల్ అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ. ఏర్పుల క్రీస్టోఫర్, జిల్లా క్రైస్తవ నాయకులు రెవ. రాజు ఉటుకూరి, పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ యం రూబెన్,సి. హెచ్. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా నిష్పక్షపాతంగా.. బాధ్యతతో విధులు నిర్వహించాలి

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**హుజూర్ నగర్ మహా** ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఎన్నికలపై నమ్మకం ఉందని ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఎన్నికల సిబ్బందిపారదర్శకంగా నిష్పక్షపాతంగా,బాధ్యతతో విధులు నిర్వహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు జిల్లాలో డిసెంబర్ 17 న నిర్వహించే మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మంగళవారం గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు, మఠంపల్లి, హుజూర్నగర్ మండలాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుజూర్నగర్ డివిజన్ పరిధిలోని హుజూర్నగర్, మఠంపల్లి,మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలోని 146 గ్రామపంచాయతీ సర్పంచ్ లకు,1318 వార్డు సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవ్వగా 22 సర్పంచులు ,257 వార్డు సభ్యులు ఏకగ్రీవం అవ్వడంతో డిసెంబర్ 17న 124 గ్రామపంచాయతీలకు 1061 వార్డు సభ్యులకు 1176 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

### షేక్ సయ్యద్ పార్వతీవదేహానికి నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట పట్టణంలోని 11వ వార్డు (రాయినిగూడెం)లో సోమవారం రోడ్డు ప్రమాదంలో మరణించిన షేక్ సయ్యద్ పార్థివదేహాన్ని మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## కడ్తాల్ లో పడిపూజతో పరవశించిన భక్తులు..

**ఆమనగల్లు, మహా:** అయ్యప్ప స్వామి భక్తులతో పరివేష్టితమైన పడిపూజ, ఇరుముడి కార్యక్రమం కొంద్రుగాని బోడు తండా సర్పంచ్ శారదాబిక్కు నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్వాములు, భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనల అనంతరం అయ్యప్ప స్వామికి పడిపూజ నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టే కార్యక్రమం భక్తిపూర్వకంగా కొనసాగిందని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. గురుస్వాముల మార్గదర్శకత్వంలో స్వాములు శరణుఘోషలు చేస్తూ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించినట్లు తెలిపారు. గురుస్వామి బిక్కు నాయక్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు గోపి నాయక్,మాజీ సర్పంచులు శారదాబిచ్య నాయక్,లాయక్ అలీ,మూడ అశోక్,కొట్యా నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా ప్రతిపాదనలతో డివిజన్లు ఏర్పాటు చేయాలి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..**

**రాజేంద్రనగర్, మహా ;** హైదరాబాద్ మహానగరంలో జిహెచ్ఎంసిలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డివిజన్లు పునర్విభజన కారణంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో డివిజన్ల సరిహద్దుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజనలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్ల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్లో దాదాపు 80,వేల ఓట్లు ఉంటాయి, ఇతర డివిజన్ లతో పోల్చుకుంటే మూడు డివిజన్లను చేయాలన్నారు. చిన్నగా ఉన్న నర్సింగి మున్సిపాలిటీని మూడు డివిజన్లుగా చేశారని దుయ్యబట్టారు. మణికొండ ప్రాంతంలో 60 వేల జనాభా ఉన్న రెండు డివిజన్లకు మాత్రమే పరిమితం చేశారని వాపోయారు. మరోసారి డివిజన్ల పునర్విభజనలో జరిగిన సరిహద్దు లోపాలు సరిచేయాలని కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.



## పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకము..

**మాజీ చైర్మన్ సుష్మా రెడ్డి**



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ లో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో మహిళా మండలి హాల్లో సప్తశక్తి సంగం (మహిళా సమ్మేళనం) కార్యక్రమము మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మేకల హిమబిందు, శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు చిన్ననాటి విషయాలను సరస్వతి శిశు మందిర్ తో ఉన్నా అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మాజీ చైర్మన్ సుష్మ రెడ్డి మాట్లాడుతూ భారత భారతదేశంలో మహిళల పాత్ర పిల్లల వికాసంపై మహిళలకు వివరించారు. పర్యావరణం పరిరక్షణలో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనది అన్నారు. ప్లాస్టిక్ నివారణలో మనమందరము బుట్ట సంచులు వాడాలి, వీలైనన్ని మొక్కలను నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని మహిళలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశు మంది పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌభాగ్యవతి, ఆచార్య బృందం, మాతృమండలి సభ్యులు, 200 మంది పాల్గొన్నారు.



## మంత్రి కొండా సురేఖను కలిసిన డిఎస్ టెంపుల్ చైర్మన్

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ పర్యావరణ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో ఇటీవల శ్రీ దుర్గేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా మడిపల్లి స్వప్న కృష్ణ గౌడ్ నియమితులైన సందర్భంగా వరంగల్ ఓ సిటీ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారి పట్టు వస్త్రాల తో పాటు ప్రసాదాలు అందజేసారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శ్రీ దుర్గేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం, అలాగే కమిటీ క్రమశిక్షణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## ఓటర్లను ఆకట్టుకునేలా గ్రీన్ పోలింగ్ కేంద్రాలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలో మూడవ విడత లో భాగంగా బుధవారం జరగనున్న ఎన్నికలకు పలు పోలింగ్ కేంద్రాలను గ్రీన్ పోలింగ్ కేంద్రాలు గా సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో రమూడవ విడతలో ఈ నెల 17వ తేదీన బుధవారం జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రీన్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను ఆకుపచ్చని తోరణాలతో స్వాగతం పలుకుతూ గ్రీన్ మ్యాట్లు వేశారు. ఈ పోలింగ్ కేంద్రాల ముందు ఓటర్లను ఆకట్టుకునే విధంగా ముగ్గులు వేశారు. అదేవిధంగా వయో వృద్ధులు, దివ్యంగుల సౌకర్యం కొరకు విల్ చైర్ లను ఏర్పాటుచేశారు. ఈ మేరకు నర్సంపేట మండలం: లక్నేపల్లి ఇటుకాలపల్లి, పోలింగ్ కేంద్రాలు, ఖనాపూర్ మండలం: ఖనాపూర్, రాగంపేట పోలింగ్ కేంద్రాలు, చెన్నారావుపేట మండలం: ఉప్పరపల్లి, తిమ్మరాయనిపహాడ్ పోలింగ్ కేంద్రాలు, నెక్కొండ మండలం: రెడ్లవాడ, ఆలంఖానిపేట్ పోలింగ్ కేంద్రాలను ఓటర్లను ఆకట్టుకునేలా హరిత పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దినట్లు కలెక్టర్ తెలిపారు. ఆహ్లాదకరమైన, వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఓటర్లను కలెక్టర్ కోరారు.



## డిజిపిని కలిసిన హోంగార్డు సంఘం నాయకులు

**హోంగార్డు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి**

**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ తో పాటు అడిషనల్ డీజీ, స్వాతి లక్రా ఐపిఎస్ ను రాష్ట్ర హోంగార్డ్ సంఘం నాయకులు వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం తోపాటు వారి ఉద్యోగ భద్రత అలాగే వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 6 రైజింగ్ డే ఘనంగా జరిపినందుకు గాను ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలుపడం జరిగిందన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల ను పెర్మనెంట్ చేయాలని వారి సమస్యలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని రాష్ట్ర హోంగార్డ్ సమస్యల పై ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ ఉపాధ్యక్షులు హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ,అశోక్ కుమార్, జాయింట్ సెక్రెటరీ నారాయణ రెడ్డి పాల్గొన్నారు

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

**మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32 వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయి తో కలిసి శంకుస్థాపన చేసిన రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ బల్దియా పరిధిలోని 32 వ డివిజన్ కరీమాబాద్ ప్రాంతం లో జనరల్ ఫండ్ నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న సైడు కాలువలు, సి సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రమంత్రిగా ఎక్కడ ఉన్నా తూర్పు నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేయడం నా బాధ్యత అని ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు, అలాగే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వరంగల్ ఓసిటిలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి వినతులు స్వీకరించి కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపి మిగతా ఫిర్యాదులను పరిష్కారాన్ని నిమిత్తం ఆయా సంబంధిత శాఖలకు, అధికారులకు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ మహా :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గల 27, 32, 35, 37, 38, 41వ డివిజన్లలో మంత్రి కొండా సురేఖ విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రకటించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రం ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పేదల సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడొద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా అభివృద్ధి కొరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే విధంగా కార్యక్రమాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను నేరుగా పరిశీలించి, పనులు నాణ్యత తో పాటు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ప్రజలతో మమేకమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొని అభివృద్ధి పనుల అమలు పై సమీక్ష చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు.



## జిల్లాలో 3వ విడత ఎన్నికలకు అంతా సిద్ధం

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** 2 వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలో జరగనున్న 3వ విడత ఎన్నికల కొరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మొదటి, రెండు విడతల ఎన్నికలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 3వ విడత ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం ఉదయ 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల తర్వాత నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఫలితాల వెల్లడి, ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతుందని వివరించారు. 3 వ విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని చెన్నూర్, మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఇందులో 102 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 390 నామినేషన్లు వచ్చాయని అన్నారు. ఇందులో 4 స్థానాలు ఏకగ్రీవం కాగా 98 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. 868 వార్డు సభ్యుల స్థానాలకు గాను 1 వేయి 905 నామినేషన్లు వచ్చాయని చెప్పారు. ఇందులో 4 స్థానాలలో నామినేషన్లు రాకపోవడం /సరైన నామినేషన్లు సమర్పించకపోవడం మినహాయించి 153 స్థానాలు ఏకగ్రీవం కాగా 711 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఎన్నికలలో 52 వేల 810 మంది పురుషులు, 54 వేల 75 మంది మహిళలు, 4 మంది ఇతరులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా, నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# వాలంటీర్ లు నిబద్ధతతో అవగాహన కలిగించాలి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**వరంగల్ మహా;** నగర ప్రజలకు వాలంటీర్ లు నిబద్ధతతో అవగాహన కలిగించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం శానిటేషన్ తనిఖీలో భాగం గా నగర పరిధిలోని 25,26 వ డివిజన్ లో కమిషనర్ ప్రత్యక్షంగా సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ 25 వ డివిజన్ లో సానిటేషన్ స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు తడి పొడి చెత్తను వేరుగా అందించడం పై అవగాహన కల్పిస్తున్నారా? వారికి కేటాయించిన ఇళ్లను సందర్శిస్తున్నారా? సేకరించిన తడి చెత్తను ఎక్కడికి తీసుకెళ్తున్నారు? వంటి విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెండు కాలనీలలో పర్యటించి స్వచ్ఛ ఆటోలో పనితీరును పరిశీలించారు. అనంతరం 26వ డివిజన్ లక్ష్మీ పురం లో గల కమేలా ను ప్రత్యక్షం గా పరిశీలించారు ప్రతి రోజు కమేలా కు వచ్చే జంతువులు ఎన్ని? ఏ విధంగా చెక్ (తనిఖీ) చేస్తున్నారు. జంతువుల నుండి వచ్చే వ్యర్థాలను ఎక్కడికి పంపిస్తున్నారు? వంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం అక్కడే ఉన్న కమ్యూనిటీ హాల్ ను కమిషనర్ తనిఖీ చేసి మాట్లాడుతూ అందులో ఏమైనా పెండింగ్ పనులు ఉంటే అంచనాలు తయారు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా 15 వ ఆర్థిక సంఘం నిధులతో కొనసాగుతున్న పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఏ సి పి ఖలీల్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, ఏ ఈ హబీబ్ , టి ఎం సి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ అలీ, తదితరులు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన ఇండిపెండెంట్ సర్పంచ్

**ఆదిలాబాద్ మహా :** బేల మండలంలోని కొబ్బాయి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా గెలిచిన సర్పంచ్ టేకం సత్యపాల్ కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆకర్షితులై, కొబ్బాయి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వైద్య నానాజీ పాటిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. గ్రామ పంచాయితీల అభివృద్ధి కోసం ఆయా గ్రామాలలో గెలిచిన ఇండిపెండెట్లు అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయన ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి ,ఆశన్న, కొండూరి రవి ,మాడవి జనార్దన్, కయ్యుమ్, ప్రమోద్, వికాస్, ప్రశాంత్, వందన ,అశోక్ ఈశ్వర్ ,మన్సూర్ అహ్మద్ ,మోరేశ్వర్, శంకర్ ,రోషన్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ స్థాయిలోనూ సత్తా చాటిన బీజేపీ

**విజేతలకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ వన్నాల**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామ సర్పంచ్ గా బీజేపీ బలపరిచిన రాయపురం రమ్య ఎన్నిక కావడం రాష్ట్రానికే ఆదర్శమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు. జన్ సంఘ్ ఆవిర్భావం నుండి వర్ధన్నపేట నియోజకవర్గం బీజేపీ పార్టీకి కంచుకోటగా ఉన్న విషయం తెలిసిందే, అలాంటి వర్ధన్నపేట నియోజకవర్గం కట్రియాల గ్రామంలో ఒక్కపుడు గుజ్జ యాదగిరి రెడ్డి సర్పంచ్ గా ఎన్నికై బలమైన బీజేపీ అభ్యర్థి గా నిలిచారని గుర్తు చేశారు. తదనంతరం రాష్ట్రంలో నెలకొన్న వివిధ కారణాల వల్ల బీజేపీ క్యాడర్ ఉన్నప్పటికీ వర్ధన్నపేట నియోజకవర్గం లో రెండు సార్లు బీజేపీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, తక్కలపల్లి రాజేశ్వర రావు గెలిచినప్పటికీ వివిధ కారణాల చేత క్యాడర్ బలంగా ఉన్న విజయం దిశగా వెళ్లలేకపోయింది. కాగా ఈ గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎస్టీ రిజర్వేషన్ గా ఉన్న కట్రియాల గ్రామంలో రాయపురం రమ్య గారు ఒక చదువుకున్న యువతి, ఎస్టీ మహిళ గా, ఒక్క రూపాయి కూడా ఓటరుకు ఇవ్వకుండా యువతతో కలిసి ఇంటి ఇంటికి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ గ్రామీణ ప్రాంతాల తో పాటు దేశ హితం కోసం చేసే వివిధ పథకాలను గ్రామ ప్రజలకు వివరించి, వారిని ఉత్తేజపరిచి ప్రతి ఒక్క ఓటరుకు, ఓటుకు నోటు పంపిణీ చేసే దాష్టిక సంప్రదాయాన్ని పక్కన పెట్టీ తనను నమ్మి గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని హామీ ఇస్తూ, గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించడం అభినందనీయమని రమ్య విజయం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యాన్ని గురిచేసిందని ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీలు మద్యం, డబ్బులు విచ్చల విడిగా పంపిణీ చేసి ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఓటరు కు ఇవ్వకుండా ప్రత్యర్థి పార్టీలను మట్టి కరిపించి ఆమె గెలిచిన తీరు యవత్ ప్రజాస్వామ్యంలో ఒక మైలురాయిగా నిలిచిపోయిందని కొనియాడారు. అంతేకాకుండా ఆమె విజయానికి నాంది పలికిన గ్రామ యువత కు, ఓటర్లకు డాక్టర్ వన్నాల వెంకటరమణ పాదాభివందనాలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పంతిని గ్రామంలో విజయకేతనం ఎగురవేసిన శ్రీరామ్ భూపాల్ (కన్నయ్య) కు అలాగే వార్డు మెంబర్లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ డాక్టర్ వన్నాల ప్రతి ఒక్కరిని శాలువాతో సత్కరించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు మాట్లాడుతూ మా గెలుపుకు ప్రత్యేక కృషి చేసిన డాక్టర్ వన్నాల వెంకటరమణ కు, ఓటర్ దేవుళ్లకు, అలాగే బిజెపి జిల్లా నేతలకు, నాయకులకు, కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల తోనే గ్రామాల్లో సంక్షేమ పథకాలు, అందుతున్నాయని రానున్న రోజుల్లో పార్టీ ప్రాబల్యం మరింత పెరగడం ఖాయమని అన్నారు.

# కాంగ్రెస్ ఓటమి భయంతోనే బీఆర్ఎస్ పై దాడులు చేస్తుంది

**పోలీసులు చర్యలకు వెనకాడితే ఎసిపి కార్యాలయాన్ని ముట్టడిస్తాం**

**మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు బాల్క సుమన్ హెచ్చరిక**



**మంచిర్యాల, మహా :** కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్ ఎన్నికలలో ఓటమి భయంతోనే బీ.ఆర్.ఎస్. పై దాడులు చేస్తుందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు బాల్క సుమన్ విమర్శించారు. మంగళవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద కు సర్పంచ్ ఎన్నికలలో ఓటమిపాలవుతామనే భయంతో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తూ రౌడీ రాజకీయాలకు తెరతీసారని ఘాటుగా వ్యాక్యానించారు. సోమవారం జైపూర్ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన మా కార్యకర్తపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకవేళ పోలీసులు మెతక వైఖరి అవలంబిస్తే ఏసీపీ కార్యాలయాన్ని వేల మందితో ముట్టడిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గడ్డం వివేకానంద ప్రస్తుత కార్మిక శాఖ మంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే నియోజకవర్గంలో తిరుగనివ్వకుండా అడ్డుకుంటామని అన్నారు. అధికార పార్టీ చెప్పు చేతుల్లో అధికారులు ఉన్నారని వాక్యాన్ని ఇచ్చారు. సుందిళ్ల బ్యారేజీలో ప్రాణహిత నది నీటిని కలిపి అన్నారం బ్యారేజ్ కింద మంత్రులు వివేక్, శ్రీధర్ బాబులు కలిసి అక్రమ ఇసుక దందా చేస్తున్నారని మండిపడ్డారు. చెన్నూరు మున్సిపాలిటీలో పెండింగ్ లో ఉన్న పనులు త్వరగా ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భారత రాష్ట్ర సమితి నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి సిఎండి గా బాధ్యతలు స్వీకరించిన దేవరకొండ కృష్ణ భాస్కర్



**మంచిర్యాల, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ సీఎండీగా దేవరకొండ కృష్ణ భాస్కర్ మంగళవారం సింగరేణి భవన్ లో బాధితులు స్వీకరించారు. మంగళవారం వరకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ 7 సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళ్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణికి కొత్త సీఎండీ గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి భవన్ ఉద్యోగులు సిబ్బంది కొత్త చైర్మన్ కు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు స్వాగతం పలికారు. డి కృష్ణ భాస్కర్ (2012) బ్యాచ్ కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్ కో సీఎండీగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యుల స్పెషల్ కార్యదర్శి గాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గానూ, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖకు స్పెషల్ కార్యదర్శి గానూ వ్యవహరించారు.

## సింగరేణి సిఎండిగా బాధ్యతలు స్వీకరించిన దేవరకొండ కృష్ణ భాస్కర్



**మంచిర్యాల, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ సీఎండీగా దేవరకొండ కృష్ణ భాస్కర్ మంగళవారం సింగరేణి భవన్ లో బాధితులు స్వీకరించారు. మంగళవారం వరకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ 7 సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళ్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణికి కొత్త సీఎండీ గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి భవన్ ఉద్యోగులు సిబ్బంది కొత్త చైర్మన్ కు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు స్వాగతం పలికారు. డి కృష్ణ భాస్కర్ (2012) బ్యాచ్ కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్ కో సీఎండీగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యుల స్పెషల్ కార్యదర్శి గాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గానూ, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖకు స్పెషల్ కార్యదర్శి గానూ వ్యవహరించారు.

# ది కో ఆపరేటివ్ స్టోర్స్ కల్పలత సూపర్ బజార్ లో భారీ కుంభకోణం

**ఆకస్మిక తనికి చేసిన ఎమ్మెల్యే నాయిని.. జరిగిన కుంభకోణం, అక్రమాల పై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే**



**హన్మకొండ మహా;** ది కో ఆపరేటివ్ స్టోర్స్ కల్పలత సూపర్ బజార్ లో బినామీల పేర్లతో జీతాలు, సొంత వాహనాలు డీజిల్, సభ్యత్వ నమోదులో అవకతవకలు పట్ల ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రంగా వెంటనే సంబధిత పత్రాలను పరిశీలన చేసి,సీజ్ చేయాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశించారు. ముఖ్యంగా సత్వరమే కమిటీ రద్దు చేసి,విచారణ చేపట్టాలని కలెక్టర్, ఆర్డీవో లకు ఎమ్మెల్యే నాయిని సూచించారు. వివరాలు కెళ్తే.. హనుమకొండ జిల్లా ది కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ కల్పలత సూపర్ బజార్ కార్యాలయాన్ని మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొదటగా ఎమ్మెల్యే వెళ్లిన వెంటనే కార్యాలయంలో సిబ్బంది లేకపోవడం వల్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రిజిష్టర్ లో ఏడుగురు సిబ్బంది ఉన్నప్పటికీ కేవలం ముగ్గురు మాత్రమే హాజరవడం అందులో ఇద్దరు మాత్రమే విధులలో ఉండటం పై ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. రికార్డులు,రిజిస్టర్,జమ,ఖర్చు తాలూకా రికార్డులను ఎమ్మెల్యే నాయిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమ్మెల్యే తనిఖీల్లో ప్రధానంగా దృష్టికి వచ్చిన అంశాలు.. గతపాలకుల చేతిలో ఇంకా కీలు బొమ్మల్లా వ్యవహరిస్తూ సభ్యత్వ నమోదులో ఆర్థికపరమైన అవకతవకలు జరిగాయని తనికీలలో స్పష్టంగా కనిపిస్తోందని సభ్యత్వ నమోదుకు చెల్లించిన రుసుము మొత్తాన్ని పక్కదారిలో ఉపయోగించి వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని గుర్తించారు. అంతేకాకుండా కల్పలత సూపర్ బజార్ పాలకమండలి సభ్యులు తమ స్వప్రయోజనాలకు డీజిల్, పెట్రోల్ గడిచిన 3 ఏళ్లుగా వాడుకున్నారని వాటికి ఎటువంటి అనుమతులు లేవని, డీజిల్ డబ్బులు కూడా చెల్లాయించలేదని ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. ది కో ఆపరేటివ్ ఆదీనంలో నడుస్తున్న పెట్రోల్ బంక్ లో 10 మంది సిబ్బంది పేరుతో నెలకు 10000/ ల చొప్పున జీతాలను తీసుకుంటున్నారు. కాగా జీతాలు తీసుకుంటున్న వారి వివరాలు రిజిస్టర్ లో ఉన్నప్పటికీ వారి సంతకాలు లేవని తనిఖీల అనంతరం రిజిస్టర్ లను వెంటనే జప్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఫోన్ ద్వారా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ చాలా రోజులుగా కల్పలత సూపర్ బజార్ లో అవకతవకలు జరుగుతున్నాయని నా దృష్టికి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రంగంలో అవినీతి జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇక్కడ జరిగిన కుంభకోణం పై వెంటనే విచారణ చేపట్టాలని సంబధిత అధికారులను కోరడం జరిగిందని తెలిపారు. సొసైటీలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, తప్పు చేసిన వారి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని అధికారులను ఆదేశించారు.



# ఐఐటీ చదివి.. మీషో

## బిలినీయర్ జాబితాలోకి విదిత్ ఆత్రే

ఈకామర్స్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న మీషో లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విదిత్ ఆత్రే(34) నికర విలువ మంగళవారం ఒక బిలియన్ డాలర్ మార్కును అధిగమించి.. బిలియనీర్ల క్లబ్‌లో చేరారు. మీషో షేర్లు ఒక్కసారిగా 13% పెరగడంతో అతని నికర విలువ రూ.9,142.87 కోట్లకు చేరుకుంది. ఐఐటీ ఢిల్లీలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి ఐటీసీ, ఇన్‌మోబీ వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన విదిత్ ఆత్రే.. మీషోకు సారథ్యం వహిస్తూ భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు స్ఫూర్తినిస్తున్నారు.

1991లో జన్మించిన విదిత్ ఆత్రే ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT) ఢిల్లీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో 2012లో బీటెక్ పూర్తి చేశారు. భారతదేశంలోని అత్యుత్తమ విద్యా సంస్థల్లో ఒకటైన ఐఐటీ ఢిల్లీలో చదవడం ఆయనకు బలమైన సాంకేతిక పునాదిని అందించింది. గ్రాడ్యుయేషన్ తరువాత ఆత్రే తన కెరీర్‌ను ఐటీసీ లిమిటెడ్‌లో ప్రారంభించారు. ఆయన జూన్ 2012 నుంచి మే 2014 వరకు చెన్నైలో ఫ్యాక్టరీ కార్యకలాపాల్లో పనిచేశారు. ఆ తరువాత మొబైల్ టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న ఇన్‌మోబీ(InMobi) సంస్థలో జూన్ 2014 నుంచి జూన్ 2015 మధ్య బెంగుళూరులో పనిచేశారు.

**మీషో స్థాపన**

వృత్తిపరమైన అనుభవాన్ని మూటగట్టుకున్న తర్వాత ఆత్రే పారిశ్రామికవేత్తగా మారాలని నిర్ణయించుకున్నారు. జూన్ 2015 నుంచి ఆయన మీషో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (CEO) నాయకత్వం వహిస్తున్నారు. మీషోను స్థాపించడంలో, దానిని విజయవంతమైన ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తన దూరదృష్టితో భారతదేశంలోని టైర్2, టైర్3 నగరాల వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని, ముఖ్యంగా జీరోకమీషన్ మోడల్‌తో విక్రేతలకు, చిరు వ్యాపారులకు ఈకామర్స్ వేదికను అందుబాటులోకి తెచ్చారు. తన నాయకత్వంలో మీషో వేగంగా ఎదిగింది. దీని ఫలితంగా ఆత్రే ఫోర్బ్స్ 30 అండర్ 30 (ఆసియా & ఇండియా, 2018), ఫార్చ్యూన్ 40 అండర్ 40 (2021) వంటి ప్రతిష్టాత్మక యువ నాయకత్వ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. మీషో డిసెంబర్ 10న స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేసి తన ఇష్యూ ధరకు ప్రీమియం వద్ద లిస్ట్ అయింది. లిస్టింగ్ రోజున రూ.111 ఐపీఓ ధర కంటే 53% ఎక్కువగా ముగించింది. మంగళవారం, స్టాక్ అసాధారణ ర్యాలీని కొనసాగించి ఇంట్రాడే గరిష్ట స్థాయి రూ.193.50 కి చేరుకుంది.

**విదిత్ ఆత్రే నికర విలువ**

మీషోలో విదిత్ ఆత్రేకు 11.1 శాతం వాటా ఉంది. షేరు ధర రూ.193.50 ఇంట్రాడే గరిష్టానికి చేరుకోవడంతో ఆయన వాటా విలువ రూ.9,142.87 కోట్లుగా ఉంది. అంటే సుమారు 1.005 బిలియన్ డాలర్లుగా ఉంది. కంపెనీ సహ వ్యవస్థాపకుడు సంజీవ్ బర్న్వాల్ 31.6 కోట్ల షేర్లతో రూ.6,114.6 కోట్ల విలువైన వాటాను కలిగి ఉన్నారు. మీషో మార్కెట్ క్యాపిటలైజేషన్ పూర్తి ప్రాతిపదికన రూ.85,207.91 కోట్లుగా ఉంది.

# భారీగా పెరిగిన సంపద..



టెస్లా అధినేత.. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 600 బిలియన్ డాలర్ల (రూ. 54.56 లక్షల కోట్లు) నికర విలువ కలిగిన మొదటి వ్యక్తిగా రికార్డ్ క్రియేట్ చేశారు. స్పేస్‌ఎక్స్ 800 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో పబ్లిక్‌గా (ఐపీఓ) వచ్చే అవకాశం ఉందనే వార్తలు వెలువడిన వెంటనే.. మస్క్ నికర విలువ ఒక రోజులో 168 బిలియన్ డాలర్లు పెరిగింది. స్పేస్‌ఎక్స్ సీఈఓ ఇప్పటికే.. ఈ ఏడాది అక్టోబర్‌లో 500 బిలియన్ డాలర్ల మైలు రాయిని దాటారు. కాగా ఇప్పుడు ఈయన సంపద 600 బిలియన్ డాలర్లకు చేరింది. స్పేస్‌ఎక్స్‌లో మస్క్ 42 శాతం వాటాను కలిగి ఉండటం వల్ల.. సంపద ఒక రోజులోనే భారీగా పెరిగిపోయింది. ఇది అనేక దేశాల GDP కంటే ఎక్కువ. దీంతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా.. మస్క్ తన స్థానాన్ని మరోమారు సుస్థిరం చేసుకున్నారు. స్పేస్‌ఎక్స్ మాత్రమే కాదు, ఎలాన్ మస్క్ తన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లాలో దాదాపు 12% వాటాను కలిగి ఉన్నారు. ఇది కూడా ఈయన సంపదను పెంచడంలో దోహదపడింది. టెస్లాలో మస్క్ వాటా ఇప్పుడు దాదాపు 197 బిలియన్ డాలర్లుగా ఉంది. మార్చి 2020లో, టెస్లా సీఈఓ సంపద 24.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తరువాత జనవరి 2021లో దాదాపు 190 బిలియన్ డాలర్ల నికర విలువతో మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు అయ్యాడు. అయితే.. మస్క్ సంపద పెరుగుదల అక్కడితో ఆగలేదు, ఎందుకంటే ఆయన నికర విలువ డిసెంబర్ 2024లో 400 బిలియన్ డాలర్లకు, అక్టోబర్‌లో 500 బిలియన్ డాలర్లకు చేరింది. ఇప్పుడు తాజాగా 600 బిలియన్ డాలర్ల మార్క్ దాటింది.

## ఏటీఎం నుంచి పీఎఫ్ విత్‌డ్రా..

# కొత్త డెడ్‌లైన్

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO).. చందాదారులు తమ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (EPF)ను ఏటీఎం ద్వారా, యూపీఐ ద్వారా విత్‌డ్రా చేసుకోవడానికి ఉపయోగపడే ఫీచర్ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ అంశంపై కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయా స్పందించారు. 2026 మార్చిలోపు ఏటీఎం ద్వారా, యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వస్తుందని మన్సుఖ్ మాండవీయా పేర్కొన్నారు. మీరు ఇప్పటికే 75 శాతం పీఎఫ్‌ను విత్‌డ్రా చేసుకోవచ్చు. దీనిని మరింత సరళతరం చేయడంలో భాగంగానే ఏటీఎం విత్‌డ్రా ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత ఈపీఎఫ్ ఉపసంహరణ విధానాన్ని కూడా మాండవియా హైలైట్ చేశారు. ఉద్యోగులు తమ ప్రావిడెంట్ ఫండ్‌ను ఉపసంహరించుకోవడానికి అనేక ఫామ్‌లను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇది చాలా మంది సభ్యులకు ఇబ్బందిగా మారుతుందని, ఇటువంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని మంత్రిత్వ శాఖ ఈపీఎఫ్ ఉపసంహరణలను సులభతరం చేస్తోందని మంత్రి అన్నారు. అక్టోబర్ 2025లో, ప్రావిడెంట్ ఫండ్ కార్యకలాపాలను సులభతరం చేయడానికి, వేగవంతం చేయడానికి ఈపీఎఫ్ఓ ప్రధాన సంస్కరణలను ఆమోదించింది. ఈపీఎఫ్ ఉపసంహరణ నియమాలు గందరగోళంగా ఉన్నాయని, దీని వల్లనే కొన్నిసార్లు పీఎఫ్ ఉపసంహరణ ఆలస్యం, తిరస్కరణ జరుగుతోందని కార్మిక మంత్రి వెల్లడించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఉపసంహరణ చట్టాన్ని సరళీకృతం చేయడానికి మంత్రిత్వ శాఖ 13 వర్గాలను విలీనం చేసి 3 విభాగాలుగా వర్గీకరించారు. ఇది పీఎఫ్ ఉపసంహరణను మరింత సులభతరం చేసింది.





## తగ్గిన బంగారం దిగుమతులు..

# నవంబర్‌లో 60 శాతం

దేశీయంగా బంగారం దిగుమతులు గత నెలలో వార్షికంగా 60 శాతం క్షీణించాయి. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం నవంబర్‌లో 4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది(2024) నవంబర్‌లో 9.8 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతులు నమోదయ్యాయి. 2025 అక్టోబర్‌లో మూడు రెట్లు ఎగసి 14.72 బిలియన్ డాలర్లను తాకిన పసిడి దిగుమతులు ఈ ఏడాది(2025) ఏప్రిల్-నవంబర్ కాలంలో 3.3 శాతం పెరిగి 45.26 బిలియన్ డాలర్లను తాకాయి. గతేడాది ఇదే కాలంలో ఇవి 43.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. కాగా.. పసిడి దిగుమతులు క్షీణించడంతో గత నెలలో దేశ వాణిజ్య లోటు తగ్గి 24.53 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది ఐదు నెలల కనిష్టంకాగా.. దిగుమతులు నీరసించడంతో దిగుమతుల బిల్లు సైతం తగ్గిందని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ఎమర్జెన్సీ.. ఇంకెన్నాళ్లో?

**తీవ్ర వాయుకాలుష్యానికి తోడయ్యే దట్టమైన పొగమంచు.. ఎటు చూసినా మాస్కులు ధరించిన ప్రజలు.. కరోనా కానరాకుండా పోయినా శీతాకాలంలో మన దేశరాజధాని వీధుల్లో కనిపించే దృశ్యాలివే!. వాహనాల గొట్టాలు కక్కే పొగ, ఇండస్ట్రీల నుంచి వెలువడే ప్రాణాంతక వాయువులు, నిర్మాణాలు వెదజల్లే ధూళి.. పంట అవశేషాల దహనాలు .. ఇవన్నీ కలగలిసిపోయి ఢిల్లీని ఓ గ్యాస్ చాంబర్‌గా మార్చేస్తున్నాయి..**



ప్రతి సంవత్సరం ఢిల్లీ ప్రభుత్వం.. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (GRAP) స్టేజ్ III, స్టేజ్ IV లాంటి ఎమర్జెన్సీ చర్యలు తీసుకుంటోంది. ఆ సమయంలో కన్స్ట్రక్షన్ పనులు ఆపేస్తారు. డీజిల్, పెట్రోల్ వాహనాలపై పరిమితులు పెడతారు. స్కూల్స్ మూసేస్తారు. ఆఫీసులను హైబ్రిడ్.. మరింత దిగజారితే వర్క్‌ఫ్రమ్ హోంకు పరిమితం చేస్తారు. గాలి మందగించి, పొగమంచు కమ్ముకుని, ప్రజలు మాస్కులు ధరించి బయటకు వస్తున్నారు. అయితే ఇవన్నీ తాత్కాలిక చర్యలు మాత్రమే. ఈ ఏడాది పరిస్థితి మరింతగా ముదిరింది. పిల్లలను కనీసం బయట కూడా తిరగొద్దని కోర్టులు చెప్పే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయినా దీర్ఘకాలిక పరిష్కారం లేకపోవడం వల్ల ఎమర్జెన్సీనే నార్మల్‌గా మారింది. పాలసీ ఫాటీగ్ (మానసిక, భావోద్వేగ అలసట) పరిస్థితి ఏర్పడింది. ప్రజలు కూడా ఈ చర్యలను సీరియస్‌గా తీసుకోవడం మానేశారు. ఢిల్లీ కాలుష్యం కథ ఒక నిరంతర యుద్ధం. ప్రతి సంవత్సరం అదే దృశ్యం.. అదే చర్యలు.. అదే విఫలత. కానీ ఈసారి ప్రశ్న వేరుగా ఉంది. దేశరాజధానికి ఊపిరి ఇవ్వాలంటే.. సిస్టమ్ మొత్తాన్ని రీడిజైన్ చేయగలమా? లేదంటే ఎమర్జెన్సీని నార్మల్‌గా అంగీకరించేస్తూ పోతారా?..

**ఢిల్లీలోనే ఎందుకంటే..**

ఢిల్లీలో వాయు నాణ్యత నానాటికీ ఎందుకు పడిపోతోంది?. ఎందుకంటే.. మిగతా మెట్రో నగరాలతో పోలిస్తే.. ఢిల్లీలో వాహనాల సంఖ్య ఎక్కువ. ఎన్సీఆర్‌లో ప్రధానంగా ఉండే కోల్ ఆధారిత పవర్‌ప్లాంట్లు.. ఫ్యాక్టరీలు ప్రమాదకరమైన వాయువుల్ని విడుదల చేస్తుంటాయి. చుట్టుపక్కల పంజాబ్, హర్యానాల రైతులు పంటలని కాల్చడంతో ఆ పొగ కాలుష్యానికి తోడవుతోంది. వీటన్నింటికి తోడు.. నిరంతరాయంగా కొనసాగే నిర్మాణ పనులతో ఆ ధూళి గాల్లో కలిసి కాలుష్యం మరింతగా పెరిగిపోతోంది.

**శాశ్వత పరిష్కారం ఉండవా?**

దేశరాజధానిలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రజల అవసరాలకు తగ్గట్లు పెంచాలి. మెట్రో లైన్లు విస్తరించినా.. బస్సుల సంఖ్య తక్కువ. ఫలితంగా ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడుతున్నారు. పంట అవశేషాల దహనం ఆపడానికి రైతులకు ప్రత్యామ్నాయాలు ఇవ్వాలి, కానీ సపోర్ట్ సిస్టమ్ బలహీనంగా ఉంది. రైతులు తక్కువ ఖర్చుతో పంట అవశేషాలను కాల్చేయడం తప్ప వేరే మార్గం కనిపించడం లేదు. ఆరోగ్య వ్యవస్థ కూడా ఈ కాలుష్యాన్ని ఎదుర్కోలేకపోతోంది. WHO ప్రమాణాల కంటే 10-15 రెట్లు ఎక్కువ టాక్సిక్ లెవెల్స్ ఢిల్లీలో నమోదవుతున్నాయి. ఆసుపత్రుల్లో శ్వాస సమస్యలు, కంటి ఇర్రిటేషన్, గుండె సంబంధిత సమస్యలతో రోగులు పెరుగుతున్నారు. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు, పబ్లిక్ హెల్త్ సిస్టమ్ కూడా విఫలమవుతున్నదనే సూచన. ప్రైవేట్ రంగం, స్టార్టప్‌లు కాలుష్య నివారణ కోసమంటూ ముందుకు వస్తున్నాయి. కార్‌పూలింగ్ యాప్‌లు, ఎయిర్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీలు, క్రాప్ రెసిడ్యూ ప్రాసెసింగ్ వంటి పరిష్కారాలు ప్రతిపాదిస్తున్నారు. కానీ ఇవి చిన్న స్థాయిలో మాత్రమే ఉన్నాయి. ఢిల్లీ లాంటి మహానగరానికి ఇవి సరిపోవు. పెద్ద స్థాయిలో అమలు చేయడానికి ప్రభుత్వ మద్దతు, ప్రజల సహకారం కచ్చితంగా అవసరం. అంటే ఢిల్లీ పొల్యూషన్ కేవలం వాతావరణ సమస్య కాదు.. ఒక సిస్టమిక్ ఫెయిల్యూర్‌కి ప్రతీక. ఇది ప్రభుత్వ పాలసీల లోపం, అమలు బలహీనత, ప్రజల ప్రవర్తన, ఆర్థిక ఒత్తిళ్లు అన్నీ కలిసిన విఫలత.

# క్రీడాశాఖ మంత్రి రాజీనామా



**ఢిల్లీ:** ఇటీవల అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ రాక సందర్భంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో చోటు చేసుకున్న విధ్వంసానికి బాధ్యత వహిస్తూ క్రీడాశాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ రాజీనామా చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేయగా దాన్ని సీఎం మమతా బెనర్జీ ఆమోదించారు. ఈనెల 13వ తేదీన తేదీన బెంగాల్లో మెస్సి రాక సందర్భంగా చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో సీఎం మమత బెనర్జీ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేసింది వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం. ఘటన జరిగిన రోజు క్రీడాకారులకు క్షమాపణ చెప్పిన మమత బెనర్జీ.. ఆ విధ్వంసానికి కారణమైన వారిపై చర్యలు చేపట్టారు. ఈవెంట్ ఏర్పాటు చేసిన ఆర్గనైజర్లను ఇప్పటికే అరెస్ట్ చేయగా, తాజాగా క్రీడామంత్రి రాజీనామాను సైతం ఆమోదించారు మమతా. లియోనెల్ మెస్సీ కార్యక్రమంలో గందరగోళం, విధ్వంసం పై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం డిజిపి రాజీవ్ కుమార్, బిధన్ నగర్ సిపి ముఖేష్ కుమార్, యువజన వ్యవహారాలు & క్రీడా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేష్‌కుమార్ సిన్హా లకు షోకాజ్ నోటీస్ జారీ చేసింది పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం.కార్యక్రమం జరిగిన రోజున తన విధులు, బాధ్యతలలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు డిసిపి అనీష్ సర్కార్ (ఐపిఎస్) పై శాఖాపరమైన చర్యలు చేపట్టిందిప్రభుత్వం.

# ఆధార్, పార్సిల్ అంటూ..

## మహిళా టెకీని బెదిరించి రూ. 2 కోట్ల మోసం

**డిజిటల్ అరెస్ట్ మోసానికి బలవుతున్న బాధితులు సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నకిలీ అధికారుల వలలో పడి బాధితులు కోట్ల రూపాయలను నష్టపోతున్నారు. బాధితుల్లో విద్యాధికులే ఎ క్కువగా ఉండటం మరింత విచారకరం. తాజగా బెంగళూరుకు చెందిన ఐటీ ఉద్యోగి 2 కోట్ల విలువైన ఆస్తులను అమ్ముకున్నవైనం ఆందోళన రేపుతోంది.**



బెంగుళూరుకు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ నిపుణురాలు బబితా దాస్ డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లో రూ. 2 కోట్లు నష్టపోయింది. నకిలీ పోలీసుల డిమాండ్లను నెరవేర్చేందుకు తను ఉంటున్న ఇంటినీ, మరో రెండు ప్లాట్లను తెగనమ్ముకుంది. బాధితురాలు ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ, తన 10 ఏళ్ల కొడుకుతో కలిసి విజ్ఞాన్ నగర్‌లోని ఫ్లాట్‌లో నివసిస్తోంది బబితా. జూన్‌లో, కొరియర్ అధికారిగా నటిస్తున్న ఒక వ్యక్తి నుండి ఆమెకు ఫోన్ వచ్చింది. ఆమె ఆధార్ కార్డుకు సంబంధించిన ఒక అనుమానాస్పద లగేజీని తాము స్వాధీనం చేసుకున్నట్లు నమ్మించాడు. ఆ కాల్‌ను తక్షణమే ముంబై పోలీసు అధికారులుగా చెప్పుకుంటున్న మరో కేటుగాళ్లకు బదిలీ చేశాడు. అరెస్టు చేస్తామని బెదిరించి, ధృవీకరణ పూర్తయ్యేవరకు బయటకు వెళ్లకూడదని హెచ్చరించారు. మోసగాళ్లు ఒక నిర్దిష్ట మొబైల్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేయాలని బెదిరించారు. తమకు సహకరించి అలా చేయకపోతే, కొడుకువిషయంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. తాము చెప్పినట్టుగా చెల్లింపులు చేసి, ఆ తరువాత పోలీసుల ద్వారా తిరిగి పొందవచ్చని నమ్మబలికారు. దీంతో బిడ్డ భవిష్యత్తు గురించి భయపడిపోయిన ఆమె వాళ్లు చెప్పినట్టే చేసింది. తక్కువ ధరకే మలూరు లోని రెండు ప్లాట్లను , ఇటు తాను ఉంటున్న విజ్ఞాన్ నగర్ ఫ్లాట్‌ను కూడా అమ్మేసింది. తద్వారా వచ్చిన సొమ్మును ను మోసగాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసింది. దీంతో పాటు ఆమె బ్యాంకు నుండి రుణం కూడా తీసుకుని సుమారు రూ. 2 కోట్లు మోసగాళ్లకు చెల్లించింది. ఆ తరువాత మోసగాళ్లు తరువాత డబ్బును తిరిగి పొందడానికి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లమని చెప్పి, అకస్మాత్తుగా కాల్ కట్ చేశారు. ఆ తర్వాత యథావిధిగానే వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె వైట్‌ఫీల్డ్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు డిజిటల్ అరెస్ట్ స్కామ్‌పై దర్యాప్తు ప్రారంభించారు.

## పొగరాయుళ్లకు

# భారీ షాక్

భారతదేశంలో ధూమపానం మరింత ఖరీదైనదిగా మారబోతోంది. భారత పార్లమెంటు సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025ను ఆమోదించింది. పొగాకు ఉత్పత్తులపై అధిక పన్నును విధించేలా 1944 సెంట్రల్ ఎక్సైజ్ చట్టాన్ని సవరించింది. దీన్ని ఈ నేపథ్యంలో పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలు గణనీయంగా పెరగనున్నాయి. అధిక సుంకాలు వినియోగదారుల ఖర్చులను తప్పనిసరిగా పెంచుతాయని, కాలక్రమేణా వినియోగాన్ని తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పొగాకు వినియోగాన్ని అరికట్టడం , ప్రజారోగ్యాన్ని కాపాడటం అనే ఒకే స్పష్టమైన లక్ష్యంతో సిగరెట్లు, సిగార్లు, హుక్కా పొగాకు, నమిలే పొగాడు, సువాసనగల పొగాకుపై పన్నులను పెంచేందుకు ఈ చట్టం ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది. కొత్త ప్రతిపాదన ప్రకారం సిగరెట్లపై ఎక్సైజ్ సుంకం ఇప్పుడు పరిమాణం మరియు రకాన్ని బట్టి 1,000 రూ. 11,000 వరకు పెరగవచ్చు. చిన్న , ఫిల్టర్ సిగరెట్లు ధరలు బాగా పెరుగుతాయి. అటు ప్రీమియం వేరియంట్లపై కూడా ధరల పెంపు వాయింపు భారీగానే ఉండబోతోంది. పొగాకు సెస్సు రద్దు అయిన తర్వాత కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని పెంచడానికి ఇది ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటును కూడా కల్పిస్తుంది. ఇటీవలి సవరణ ప్రకారం ఉత్పత్తి చేయని , తయారు చేయబడిన పొగాకు, పొగాకు ఉత్పత్తులు , ప్రత్యామ్నాయాలపై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని గణనీయంగా పెంచింది. ప్రధాన రేటు పెరుగుదలలు బాగా కనిపిస్తున్నప్పటికీ, GST పరిహార సెస్ నిలిపివేయడం వల్ల ఈ సవరణలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఉదాహరణకు, గతంలో రూ.200 నుండి రూ. 735 వరకు పలికిన 1,000 సిగరెట్ల ధర ఎక్సైజ్ సుంకం పెంపు తరువాత రకాన్ని బట్టి రూ.2,700 నుంచి రూ.11,000గా ఉండనున్నాయి.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | బుధవారం, హైదరాబాద్ | 17-12-2025
ANN తెలుగు


మార్గట్ రాబీ


షైలెనె వుడ్‌లే...


దిల్ రబా దిల్ మురాత్


న్యాన్ సీ మెక్ డోనీ


క్రితీ సనన్

# ప్రపంచంలో అత్యంత అందమైన టాప్ టెన్ హీరోయిన్స్..!


హనియా అమీర్

సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ పాత్రలకు గ్లామరస్ చాలా ముఖ్యం. టాలెంట్‌తో పాటు గ్లామర్ కూడా కలిసొస్తే ఇక వారికి సినీ ఇండస్ట్రీలో అవకాశాలు నల్లేరు మీద నడకే. కానీ అందంగా ఉన్నప్పటికీ సరైన హిట్ పడకపోయినా ఛాన్స్ రావడం కష్టమే. సినిమా అనే రంగుల ప్రపంచంలో అందానికి ఉన్న ప్రముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలా ఈ ఏడాది అత్యంత అందమైన తారల గురించి చర్చించుకుందాం. ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే టాప్ టెన్ అందమైన హీరోయిన్ల లిస్ట్‌లో ఇండియా నుంచి కేవలం ఒక్కరే స్థానం దక్కించుకున్నారు. ఆమె మరెవరో కాదు.. ఆదిపురుష్ భామ కృతి సనన్ మాత్రమే టాప్5లో నిలిచింది. ఈ ఏడాదితో గానూ ఐఎండీబీ ప్రకటించిన అందాల తారల లిస్ట్‌లో కృతి సనన్ ఐదో స్థానం దక్కించుకుంది. మొదటి స్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన మార్గోట్ రాబీ నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా అమెరికా బ్యూటీ షైలీన్ వుడ్లీ, చైనాకు చెందిన దిల్‌రుబా దిల్మురాత్, సౌత్ కొరియా బ్యూటీ నాన్సీ మెక్‌డోనీ నిలిచారు. టాప్5 లో బాలీవుడ్ భామ కృతి సనన్ స్థానం దక్కించుకుంది. ఆ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హానియా అమీర్ ఆరోస్థానంలో నిలిచింది. ఆ తర్వాత వరుసగా స్పెయిన్‌కు చెందిన అనా డి అర్మాస్, పారిస్‌కు చెందిన ఎమ్మా వాట్సన్, అమెరికాకు చెందిన అంబర్ హెర్డ్, టర్కీ బ్యూటీ హ్యాండే ఎర్సెల్ నిలిచారు.


అనా దే అర్మాస్


ఎమ్మా వాట్సన్


ఆంబర్ హార్డ్


హ్యాండే ఎర్సెల్

# రణ్‌వీర్ సింగ్ దురంధర్ @రూ.600 కోట్లు

బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ హీరోగా వచ్చిన లేటెస్ట్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్'. డిసెంబర్ 5న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ దుమ్ములేపుతోంది. రిలీజైన పది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.550 కోట్ల మార్కును దాటేసింది. తెలుగులో బాక్సాఫీస్ వద్ద అఖండ2 రిలీజైన దురంధర్ వసూళ్లు ఏమాత్రం తగ్గడం లేదు. కేవలం 11 రోజుల్లోనే రూ.600 కోట్ల మార్క్‌ను దాటేసింది. ఈ మూవీ సూపర్ హిట్ కావడంతో ఇప్పటికే పలువురు స్టార్స్ ప్రశంసలు కురిపించారు. అల్లు అర్జున్ సైతం మేకర్స్‌ను కొనియాడారు.



## సైయారాను దాటేసిన దురంధర్..

డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలైన దురంధర్ వసూళ్ల పరంగా దూసుకెళ్తోంది. స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో ఆడియన్స్ నుంచి విపరీతమైన ఆదరణ వస్తోంది. ఇప్పటికే ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో ఏకంగా మూడో స్థానానికి చేరుకుంది. రెండవ సోమవారం కూడా కలెక్షన్లపరంగా దుమ్ములేపింది. మొదటి సోమవారం కంటే అధిక వసూళ్లు రాబట్టింది. ఈ లిస్ట్‌లో తొలి రెండు స్థానాల్లో రిషబ్ శెట్టి కాంతార చాప్టర్1, విక్కీ కౌశల్ ఛావా ఉన్నాయి.

## కాంతార చాప్టర్-1 ను అధిగమించే ఛాన్స్..

ఈ మూవీ రిలీజై ఇప్పటికి 11 రోజులు పూర్తి చేసుకుంది. కేవలం హిందీలో మాత్రమే విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో దక్షిణాది భాషల్లోనూ డబ్ చేసి రిలీజ్ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అలా దురంధర్ తెలుగులోనూ రిలీజైతే ఈ వసూళ్లు మరింత పెరిగే ఛాన్స్ ఉంది. ఈ లెక్కన 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన కాంతార చాప్టర్1ను త్వరలోనే దురంధర్ అధిగమించే ఛాన్స్ ఉంది.

## అందుకే బజ్..

పాకిస్తాన్ నేపథ్యంలో స్టోరీ కావడం దురంధర్‌కు కలిసొచ్చిందని చెప్పొచ్చు. ఈ చిత్రంలో రణవీర్ సింగ్ పాకిస్తాన్‌లోని లయారీ ముఠాలలోకి చొరబడే భారతీయ గూఢచారి హమ్జా పాత్రలో నటించారు. ఈ మూవీలో కందహార్ విమానం హైజాక్, 2001 పార్లమెంట్ దాడి, 26/11 ముంబయి దాడులు వంటి భౌగోళిక రాజకీయ, ఉగ్రవాద సంఘటనలు చూపించారు. అందువల్లో దేశవ్యాప్తంగా ఈ మూవీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయింది. దేశ భద్రతకు సంబంధించిన అంశాలతో తెరకెక్కించడం.. రెండేళ్ల గ్యాప్ తర్వాత రణ్‌వీర్ సింగ్ మూవీ రావడం కూడా దురంధర్‌కు బాగా కలిసొచ్చింది. దీంతో బాక్సాఫీస్ వద్ద రెండో వారం కూడా అత్యధిక వసూళ్లు సాధించింది. ఇప్పటివరకు 11 రోజుల్లోనే రూ.600.75 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. రెండో వారాంతంలో ఇండియాలో ఏకంగా రూ.140 కోట్లకు పైగా నికర వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఓవరాల్‌గా చూస్తే భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. తాజాగా రూ.600 కోట్ల మార్క్‌తో ఈ ఏడాది రొమాంటిక్ బ్లాక్‌బస్టర్ సైయారా (రూ.580) కోట్ల వసూళ్లను అధిగమించింది. అంతేకాకుండా పద్మావత్ (రూ.585 కోట్లు), సంజు (రూ.592 కోట్లు) వంటి పెద్ద హిట్‌ల రికార్డులను తుడిచిపెట్టేసింది. ఆదిత్య ధార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, రాకేష్ బేడీల నటనకు ప్రశంసలు అందుకున్నారు. ఈ చిత్రంలో ఆర్ మాధవన్, అర్జున్ రాంపాల్ కూడా నటించారు. ఈ సినిమా జియో స్టూడియోస్, బి62 స్టూడియోస్ బ్యానర్లపై నిర్మించారు. ఈ మూవీకి కొనసాగింపుగా సీక్వెల్‌గా మార్చి 12, 2026న విడుదల కానుంది.

### రూ. 100 కోట్ల క్లబ్ చేరువలో

# మమ్ముట్టి సినిమా



మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టి మరో భారీ హిట్ అందుకున్నారు. 74 ఏళ్ల వయసులో ఆయన హీరోగానే కాకుండా నెగెటివ్ షేడ్ ఉన్న పాత్రలతోనూ మెప్పించారు. ఈ క్రమంలోనే తాజాగా విడుదలైన 'కలాంకావల్'లో తాను విలన్ పాత్రలో నటించారు. డిసెంబర్ 5న మలయాళంలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఏకంగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరనుంది. ఈ ఏడాది ప్రారంభంలో 'డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్' అనే మిస్టరీ కామెడీ థ్రిల్లర్ సినిమాతో మెప్పించిన మమ్ముట్టి ఇప్పుడు కలాంకావల్ అనే మూవీతో భారీ విజయం అందుకున్నారు. ఎప్పుడూ కూడా వైవిధ్యమైన పాత్రలతో, కథలతో మమ్ముట్టి ప్రయోగాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తారు. ఈ చిత్రంలో కూడా ఆయన మానసిక రోగి పాత్రను పోషించారు. దర్శకుడు జితిన్ కె. జోస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై విమర్శకులు, ప్రేక్షకుల నుండి కూడా మంచి రివ్యూలు వచ్చాయి. రెండు వారాలకు గాను 'కలాంకావల్' చిత్రం కేవలం మలయాళంలోనే రూ. 75 కోట్లు రాబట్టింది. ప్రస్తుతం చాలా థియేటర్స్‌లో మంచి కలెక్షన్స్‌తో రన్ అవుతుంది. దీంతో మరో వారంలోపు రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరుతుందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మమ్ముట్టి కంపెనీ ప్రొడక్షన్స్ నిర్మించిన 'కలాంకావల్'లో వినాయకన్, మీరా జాస్మిన్, జిబిన్ గోపీనాథ్, గాయత్రి అరుణ్, రజిషా విజయన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం మలయాళంలో మాత్రమే విడుదలైన ఈ మూవీ.. ఓటీటీలో మాత్రం తెలుగు వర్షన్ కూడా స్ట్రీమింగ్‌కు రానుంది.



### 28 ఏళ్ల తర్వాత సీక్వెల్..

# టీజర్ రిలీజ్

భారత్ పాకిస్థాన్ యుద్ధం నేపథ్యం కథతో తీసిన సినిమా 'బోర్డర్'. 1997లో రిలీజైన ఈ చిత్రం అప్పట్లో సంచనలమైంది. ప్రేక్షకుల నుంచి విశేషాదరణ దక్కించుకుంది. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్ తీశారు. 'బోర్డర్ 2' పేరుతో తెరకెక్కించారు. సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. తాజాగా విజయ్ దివస్ సందర్భంగా టీజర్ రిలీజ్ చేశారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. వచ్చే ఏడాది రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ఈ సినిమాని థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. తొలి పార్ట్‌కి జెపి దత్తా దర్శకత్వం వహించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ తీశారు. 1971లో జరిగిన ఇండోపాక్ యుద్ధం నేపథ్య కథతోనే ఈ సినిమాని కూడా తెరకెక్కించారు. ఇందులో వరుణ్ ఆర్మీ, దిల్జీత్ ఎయిర్‌ఫోర్స్, అహన్ శెట్టి నేవీ సైనికులుగా కనిపించనున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com